ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 9 డిసెంబరు 2025



సైక్లింగ్ ట్రాక్‌లు

- మరోమారు కొత్తగా ప్రతిపాదనలు
- ఏడేళ్ల క్రితం బీచ్ రోడ్డు సహా నగరంలో ట్రాక్ ఏర్పాటుకు జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏల యత్నం
- పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చని వైనం



సిరిపురంలో సైకిల్ ట్రాక్ (ఫైల్ ఫొటో)



బీచ్‌రోడ్డులో వినియోగం కోసం కొనుగోలు చేసిన సైకిళ్లు (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో సైక్లింగ్ ట్రాక్‌లు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పచ్చదనంతో కళకళలాడే విశాఖలో పర్యావరణం కోసం సైకిళ్లను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. అయితే ఈ ప్రయోగం ఇక్కడ ఏడేళ్ల క్రితమే చేసి అధికారులు వైఫల్యం చెందారు. ఇటు వీఎంఆర్‌డీఏ, అటు జీవీఎంసీ చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. అదొక్కటే కాకుండా బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ పార్కు నుంచి భీమిలి వరకూ బీచ్ కారిడార్‌లో సైక్లింగ్ ట్రాక్‌ను 27 కి.మీ. పొడవున ఏర్పాటుచేయాలని ఈ రెండు సంస్థలు ప్రతిపాదించాయి. అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం బీచ్ కారిడార్‌ను వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం విస్తరిస్తే తప్ప ఈ మార్గంలో సైక్లింగ్ కోసం ఇరువైపులా ప్రత్యేక ట్రాక్ ఏర్పాటుచేసే అవకాశం లేదు. ఉన్న మార్గం మధ్యలోనే డివైడర్ పెట్టి, అందులో మొక్కలు వేసి, గ్రిల్స్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు మూడు నుంచి నాలుగు అడుగుల విశాలమైన ఫుట్‌పాత్‌లు వేశారు. ఇప్పుడు ఆ మార్గాన్ని

... మిగతా 6వ పేజీలో

కొండంత భక్తి



నగరంలోని పాతపోస్టాఫీస్ సమీపంలో గల రోజ్‌హిల్‌పై విశాఖపురి మేరీమాత (కొండగుడి) ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల, చర్చి ఫాదర్ల ప్రార్థనల అనంతరం వేకువ జామున 4 గంటల తరువాత భక్తులను కొండపైకి అనుమతించారు. వేలాదిగా తరలివచ్చిన విశ్వాసకులు అమలోద్భవి (మేరీమాత)ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- పూర్తి వివరాలు...8లో...

21న పల్స్ పోలియో

- జిల్లాలో ఐదోళ్లలోపు కలిగినవారు 2,09,652 మంది
- నగర పరిధిలో 1,93,090, గ్రామీణ ప్రాంతాల్లో 16,562 మంది...
- ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



పల్స్‌పోలియోపై సూచనలు చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్. చిత్రంలో జేసీ మయూర్ అశోక్ ఉన్నారు.

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):
ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో ఐదేళ్లలోపు వయసు కలిగిన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. పల్స్ పోలియోపై సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అధికారులకు ఆయన పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ 100 శాతం పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,09,652 మంది ఉన్నారని, వారిలో నగర పరిధిలో 1,93,090 మంది, గ్రామీణ ప్రాంతాల్లో 16,562 మంది ఉన్నారన్నారు. పోలియో చుక్కలు వేసేందుకు 1,062 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటుచేశామన్నారు. ఏదైనా కారణంతో ఆరోజు చుక్కలు వేయించుకోని వారికి ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటికి వెళ్లి వ్యాక్సిన్ వేస్తారని, ఇందుకోసం 2004

... మిగతా 6వ పేజీలో

జ్వరాల విజృంభణ

ప్రతి ఇంటిలోనూ బాధితులు

- ఆస్పత్రులకు భారీగా రోగులు
- ఒక వైపు వైరల్ ఫీవర్స్, మరో వైపు స్క్రబ్ టైఫస్ కేసులు
- మలేరియా, చికున్‌గున్యా, చికెన్‌పాక్స్ కేసులు కూడా నమోదవుతున్నట్టు వెల్లడి

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గడిచిన కొద్దిరోజుల నుంచి జ్వరాల బారినపడి ఆస్పత్రులకు వెళుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఎక్కువ మంది ఫ్లూ జ్వరాలతో ఇబ్బంది పడుతుండగా, మరికొంతమందిలో స్క్రబ్ టైఫస్, మలేరియా, చికున్‌గున్యా, చికెన్ పాక్స్ (అమ్మవారు) కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందంటున్నారు.

వాతావరణ మార్పులతో ఫ్లూ వైరస్ యాక్టివేట్ కావడంతో జ్వరాలు విజృంభిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. వైరస్ బారినపడిన వారిలో జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటాయని పేర్కొంటున్నారు. ఫ్లూ జ్వరాలతో బాధపడుతూ కేజీహెచ్, విమ్స్‌లకు ప్రతిరోజూ 30 నుంచి 50 మంది వరకూ వస్తున్నారు. నగర పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులకు పదుల సంఖ్యలో వస్తున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

ఫ్లూ జ్వరాలు విజృంభణ

సాధారణంగా శీతాకాలంలో ఫ్లూ జ్వరాల వ్యాప్తికి కారణమయ్యే వైరస్‌లు యాక్టివ్ అవుతుంటాయి. ఈ వైరస్ బారినపడిన వారిలో చలి, జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటాయి. చిన్నారుల్లో అయితే పెదాలపై పొక్కులు, పగుళ్లు వంటి లక్షణాలతో తీవ్రమైన జ్వరం కనిపిస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రతించి మందులు వాడాలి. ప్రస్తుతం పిల్లల్లో ఫ్లూ జ్వరాలు అధికంగా కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.



భయపెడుతున్న స్క్రబ్ టైఫస్

జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు కూడా భారీగా నమోదవుతున్నాయి. ఎక్కువ మందిలో స్క్రబ్ టైఫస్ తరహా లక్షణాలు ఉంటుండడంతో వైద్యులు ముందు జాగ్రత్తచర్యగా పరీక్షలు చేయిస్తున్నారు. ఈ వ్యాధి నల్లిని పోలిన చిన్న కీటకం

... మిగతా 6వ పేజీలో

కదం తొక్కిన ఉక్కు నిర్వాసితులు

- స్టీల్‌ప్లాంటు ప్రధాన గేటు ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా
- కుటుంబాలతో పాల్గొన్న నిరుద్యోగులు



స్టీల్‌ప్లాంట్ ప్రధానగేటు ముందు బైఠాయించిన నిర్వాసిత నిరుద్యోగులు, వారి కుటుంబ సభ్యులు

- ఉపాధి కల్పించాలని లేనిపక్షంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్
- ఆ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ నెలకు రూ.25 వేలు భృతి కింద చెల్లించాలని డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):
తమకు ఉపాధి కల్పించాలని, లేకుంటే వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో స్టీల్‌ప్లాంటు నిర్వాసిత నిరుద్యోగులు సోమవారం భారీ ఎత్తున ధర్నా చేశారు.

ప్లాంటు ప్రధానగేటు ముందు ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ బైఠాయించారు. తొలుత ప్లాంటు కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అక్కడ నుంచి ర్యాలీగా ప్రధాన గేటు వద్దకు చేరుకున్నారు. నిర్వాసిత నిరుద్యోగులకు స్టీల్‌ప్లాంటు మిగులు భూముల్లో ఎకరా చొప్పున ఇవ్వాలని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని, ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు జీవన భృతి చట్టాన్ని అమలు చేస్తూ నెలకు రూ.25 వేల వంతున చెల్లించాలని పెద్దఎత్తున నినదించారు. అగనంపూడి, వడ్లపూడి, అప్పికొండ, పెదగంట్యాడ, నెలిముక్కు, గంగవరం తదితర ప్రాంతాల నుంచి భారీఎత్తున నిరుద్యోగులు

... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటులో సీసీ టీవీ కెమెరాలు?



- 267 కి.మీ. పొడవున ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఉన్నతాధికారి నివేదికలు
- రూ.కోట్ల వ్యయం అవుతుందని అంచనా
- మరో 20 రోజుల్లో పూర్తికానున్న ఇన్‌చార్జి సీఎండీ పదవీకాలం
- ఈలోగా అంత ఖర్చు అవసరమా... అంటున్న బీజేపీ నేతలు
- సీఎండీపై కార్మిక సంఘాల్లో వ్యతిరేకత
- ఏడాది కాలంలో ఆయన తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ విచారణకు డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్‌ప్లాంటులో రోజురోజుకూ పెరుగుతున్న ప్రమాదాలకు కారణాలు గుర్తించడానికి అడుగడుగునా సీసీ టీవీ కెమెరాలు పెట్టాలని యాజమాన్యం భావిస్తోంది. కర్మాగారం ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో ముడి పదార్థాలు సమకూర్చకుండా, ప్రధాన విభాగాలకు సకాలంలో నిర్వహణ పనులు చేపట్టకుండా... అరకొర వనరులతోనే 92 శాతం ఉత్పత్తి సాధించాలని ఉద్యోగ, కార్మిక వర్గాలపై ఒత్తిడి పెడుతున్నారు. ఇచ్చిన లక్ష్యం సాధించకపోతే ఆ మేరకు జీతాల్లో కోత పెడుతున్నారు. నవంబరు నెల జీతాలు ఆ విధంగానే పంపిణీ చేశారు. అందుబాటులో ఉన్న వాటితోనే పూర్తి ఉత్పత్తికి యత్నిస్తుంటే... ప్రమాదాలు జరుగుతున్నాయి. రా మెటీరియల్ సరఫరా చేసే కన్వేయర్ బెల్ట్‌లు ఎక్కడికక్కడ తెగిపోతున్నాయి. గతంలో ఇలా జరిగితే సాధారణ అంశంగా భావించిన యాజమాన్యం ఇప్పుడు మాత్రం ఉద్యోగులే కావాలని ఆ బెల్ట్‌లను కోసేస్తున్నారంటూ ప్రచారం ప్రారంభించింది. ఈ కారణం

... మిగతా 6వ పేజీలో

కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు

- భీమిలి సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణ నామినేషన్ పద్ధతిపై కేటాయింపు
- టెండర్ పిలవకుండా అస్మదీయ కాంట్రాక్టర్‌కు అప్పగింత
- మెకానికల్ అధికారుల తీరుపై స్టాండింగ్ కమిటీ సభ్యుల ఆగ్రహం
- ఆరోపణలు రావడంతో ఇప్పుడు టెండర్లు పిలిచేందుకు ప్రతిపాదన
- ఏడాదిపాటు నామినేషన్‌కు ఎలా ఇచ్చారని నిలదీసిన మేయర్
- సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ మెకానికల్ విభాగంలో అవకతవకలు రోజుకొకటి బయటపడుతున్నాయి. రూ.ఐదు లక్షలు దాటిన పనులకు టెండరు పిలిచి ఎంపికైన కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సిన అధికారులు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.24 లక్షల విలువైన భీమిలి సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణను అస్మదీయుడైన కాంట్రాక్టర్‌కు నామినేషన్‌పై ఏడాదిపాటు కొనసాగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

నగరంలో వ్యర్థాల సేకరణ, డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు ప్రక్రియను స్మార్ట్‌గా నిర్వహించడం ద్వారా పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్యానికి ఇబ్బందిలేకుండా చేసే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) ప్రాజెక్టులకు రూపకల్పన చేశాయి. మునిసిపల్ కార్పొరేషన్లు, ప్రధాన మునిసిపాలిటీల్లో ఈ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో ముడసర్లోవ, టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక, చీమలాపల్లిలో వీటిని ఏర్పాటుచేశారు. నగరంలో ఇళ్ల నుంచి చెత్తను క్లాప్ వాహనాలు సేకరించి సమీపంలోని గార్బేజీ ట్రాన్స్‌ఫర్స్ స్టేషన్ (జీటీఎస్)లకు చేరవేస్తాయి. అక్కడకు చేరిన చెత్తను సీసీఎస్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక యంత్రాలతోకంప్రెస్ చేసి కేక్ మాదిరిగా మార్చి ట్యాంకర్ మాదిరిగా ఉండే హుక్‌లోడర్ (కంటెయినర్)లోకి పంపిస్తుంది. అన్నివైపులా మూసివుండే హుక్‌లోడర్‌లో చెత్తను నేరుగా కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. దీనివల్ల చెత్త నుంచి బయటకు దుర్వాసన రావడం, గాలికి చెత్త ఎగిరి జనావాసాలు, ప్రజలపై పడే పరిస్థితి వుండదు పర్యావరణానికి కూడా ఎలాంటి సమస్య ఉండదు.



భీమిలిలోని సీసీఎస్ ప్రాజెక్టు

టెండర్‌కే టెండర్

ఇదిలావుండగా సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణను అర్హులైన కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఏడాదికి ఒకసారి టెండర్లు పిలుస్తున్నారు. అధికారులు నిర్దేశించిన

... మిగతా 6వ పేజీలో

7 ఇండిగో విమానాలు రద్దు

గోపాలపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):
విశాఖపట్నం నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన ఏడు ఇండిగో విమాన సర్వీస్‌లను సాంకేతిక కారణాలతో సోమవారం రద్దు చేశారు. వీటిలో హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్, బెంగళూరు-విశాఖ-బెంగళూరు, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్, చెన్నై-విశాఖ-చెన్నై, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్, ఢిల్లీ-విశాఖ-ఢిల్లీ, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్ విమానాలు ఉన్నాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

గంగవరం పోర్టు ముట్టడి

- వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో బకాయిల చెల్లింపునకు నిర్వాసిత ఉద్యోగుల డిమాండ్

- వార్త 8లో



ట్రయల్ షూటింగ్ చేస్తున్న ఈఎన్‌సీ చీఫ్ సంజయ్ భల్లా

నేవీలో ఇండోర్ షూటింగ్ రేంజ్ సెంటర్ ప్రారంభం

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాల్ఫిన్స్ హిల్స్ ఏరియాలో తూర్పు నౌకాదళం పది మీటర్ల రేంజ్‌లో ఇండోర్ షూటింగ్ సెంటర్‌ను సోమవారం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిని ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా సతీమణి ప్రియా భల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా భార్యాభర్తలు ఇద్దరూ వేర్వేరుగా ట్రయల్ షూటింగ్ చేశారు. ఈ కేంద్రంలో 15 వరుసల్లో ఎలక్ట్రానిక్ టార్గెట్లు ఉంటాయి. స్పోర్ట్స్ మౌలిక వసతుల్లో భాగంగా దీనిని ఏర్పాటుచేశారు.

చలికి గజగజ

- పెందుర్తి సమీపాన గల అక్కిరెడ్డిపాలెంలో 13.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంతోపాటు పరిసరాల్లో చలి తీవ్రత మరింత పెరిగింది. వాయువ్య భారతం నుంచి మధ్య భారతం మీదుగా వీస్తున్న తీవ్రమైన చలిగాలుల ప్రభావంతో వాతావరణం చల్లగా మారింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకూ చలి కొనసాగింది. తిరిగి సాయంత్రం ఐదు గంటలకే చలి మొదలైంది. ప్రధానంగా ఏజెన్సీ మీదుగా వీస్తున్న చలిగాలులకు నగరం కంటే శివారు ప్రాంతాల ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉదయం పూట బయటకు రావడానికి వెనుకంజ వేస్తున్నారు. సోమవారం పెందుర్తి సమీపాన గల అక్కిరెడ్డిపాలెంలో 13.2, పద్మనాభంలో 15.5, భీమిలి సమీపాన గల నారాయణరాజుపేటలో 15.8, విశాఖ ఎయిర్ పోర్టులో 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు, నాలుగు రోజులు చలి ఇంకా పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు.



అప్పన్నకు వైభవంగా గరుడ సేవ


గరుడ సేవ చేస్తున్న అర్చకుడు

సింహాచలం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం నిత్య కల్యాణం, గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి భక్తుల గోత్రనామాలతో శ్రీకారం చుట్టి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పూజలు జరిపారు. స్వామివారి చుట్టూ భక్తులు ముమ్మారు ప్రదక్షిణలు చేశారు. తరువాత ఉత్సవమూర్తి గోవిందుని,ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు. స్వామివారికి మంత్ర పుష్పం,కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాదానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి కాకినాడకు చెందిన పాలకుర్తి కనక సత్తిరాజు దంపతులు రూ. లక్ష విరాళం సమర్పించారు. విరాళం మొత్తం నగదు రూపంలో ఆలయ పర్యవేక్షణాధికారి పి. సునీల్‌కు సోమవారం వారు అందజేశారు. దాత కుటుంబీకులకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

చలో ఢిల్లీకి కార్మిక పించన్‌దారులు

తగరపువలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఈనెల 10న జరిగే కార్మిక పించన్‌దారుల సమావేశానికి చిట్టివలస నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. ఢిల్లీ వెళ్లిన వారిలో చిట్టివలస కార్మిక పించన్‌దారుల సంఘానికి చెందిన దామోదర బాలాజీ, మోర అప్పలరాజు, రాంబాబు, అప్పలనాయుడు, సత్యం, అప్పలరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కార్మిక పించనుదారులకు నెలకు రూ. వెయ్యి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని, ఈ మొత్తాన్ని రూ. 9 వేల పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, రైలు బస్సు ప్రయాణాల్లో రాయితీ ఇవ్వాలన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

కొమ్మాది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాదిలో చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం సోమవారంతో ముగిసింది. వారం రోజులు గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్యం, డ్రగ్స్ వల్ల నష్టాలు తదితర అంశాలపై వలంటీర్లు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే యువతకు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ కె. సునీల్‌బాబు, ప్రిన్సిపాల్ కె. సురేశ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్ జోన్ టిటి పోటీలు

సాగర్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో దక్షిణ మండల (సౌత్ జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్ పోటీలు జరగనున్నట్టు గీతం క్యాంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్ కార్తీక్ తెలిపారు. సోమవారం ఆయన వర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో దక్షిణ భారతదేశంలోని 84 వర్సిటీల నుంచి 400 మంది క్రీడాకారిణులు పాల్గొంటారని, అందులో 50 మంది జాతీయ క్రీడాకారులు ఉన్నారని తెలిపారు.

21న పల్స్ పోలియో

... 5వ పేజీ తరువాయి

టీమ్‌లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో 85 హైరిస్క్ ప్రాంతాల్లో 6,497 మంది చిన్నారులు ఉన్నారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పోలియో చుక్కలు వేయాలన్నారు. సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. పల్స్ పోలియోపై సినిమా థియేటర్లలో స్లైడ్స్, బస్ స్టేషన్, రైల్వే స్టేషన్‌లలో సీసీటీవీలు ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్‌వో సత్తిబాబు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శంకర ప్రసాద్, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు, జిల్లా ఇమ్యునేషన్ అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియా తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన ఉక్కు నిర్వాసితులు

... 5వ పేజీ తరువాయి

వారి కుటుంబ సభ్యులతో ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. త్వరలో నిర్వాసిత నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించారు.

న్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి..

స్టీల్‌ప్లాంటు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తీరని అన్యాయం జరిగిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. నిర్వాసితుల ధర్నాకు మద్దతు తెలిపిన పలు రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నలభై ఏళ్లుగా నిర్వాసితులు ఉపాధి కోసం ఆశతో ఎదురుచూస్తున్నా, న్యాయం జరగలేదన్నారు. నిర్వాసితుల గోడును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అర్థం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నాలో నిర్వాసిత నాయకులు పితాని భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, దేముడు, వంశీకృష్ణ, జగన్, రమణ, రాజకీయ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి రవి, కోమటి శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, గవర వెంకటరమణ, ప్రియాంక, గాయత్రీదేవి, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, ఎస్.రామారావు, పరంధామయ్య పాల్గొన్నారు.

రాజకీయ ప్రసంగాలను అడ్డుకున్న నిర్వాసితులు....

ధర్నాకు సంఘీభావం తెలిపిన కొంతమంది నాయకులు రాజకీయ విమర్శలు చేయడంతో నిర్వాసితులు వద్దని అడ్డుకున్నారు. కేవలం నిర్వాసితుల గురించి మాట్లాడాలని, రాజకీయాలు వద్దని గట్టిగా కేకలు వేయటంతో వారు ప్రసంగాలు ఆపేశారు. నిర్వాసితులకు అండగా ఉంటామని, పోరాటాల్లో పాల్గొంటామని ప్రకటించారు.

నిర్వాసితులను నిర్లక్ష్యం చేయుటం తగదు..మాజీ మంత్రి

ఉక్కు నిర్వాసితులను యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. నిర్వాసితులకు ఇంత అన్యాయం జరుగుతుందని నాడు అనుకోలేదని, మంచి జరుగుతుందని భావించామని వ్యాఖ్యానించారు. తన వయస్సు సహకరించినంత వరకు ఉక్కు నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఉద్యమిస్తానని పేర్కొన్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

నిర్వాసితుల ధర్నా నేపథ్యంలో సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. సౌత్ పరిధిలోని అన్ని స్టేషన్‌ల నుంచి సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని అండర్ పాత్‌వేలు

- రోడ్లకి ఇరువైపులా అమ్మకాలు
- కొన్నిచోట్ల వాహనాల పార్కింగ్
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు


తగరపువలసలో అండర్ పాత్ వే కింద అమ్మకాలు

తగరపువలస, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణ సమయంలో వివిధ ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం అండర్ పాత్ వేలు నిర్మించారు. వీటి కింద ఇష్టానుసారం దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఆనందపురం నుంచి రాజాపులోవ వరకు పెద్దిపాలెం, తాళ్లవలస, తగరపువలస, బాలాజీనగర్, మహరాజుపేట ప్రాంతాల్లో అండర్ పాత్‌వేలు ఉన్నాయి. నడిచి వెళ్లే వారు,వాహనాల రాకపోకలకు వీటిని వినియోగించాలి. కానీ వీటి కింద రక రకాల వ్యాపారాలు చేస్తుండడం వల్ల రోడ్డు ఇరుకై వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దిపాలెంలో అండర్ పాత్ వే వద్ద చిన్న హోటల్ నడుపుతున్నారు. కొబ్బరి బొండాల దుకాణాలు కూడా ఏర్పాటు చేశారు.తాళ్లవలస వద్ద పాత్‌వేకి ఇరువైపులా కూరగాయల అమ్మకాలు చేస్తున్నారు. తగరపువలస కూడలిలో సగం స్థలం వాహనాల పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారు. చాలామంది దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ వాహనాలను ఇక్కడ వదిలిపెట్టి వెళుతున్నారు. ఇదే చోట మరి కొందరు తోపుడు బళ్లు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. రోడ్డు ఇరుగ్గా మారడంతో ఎదురుదెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి అవకాశం ఉండడం లేదు. జీవీఎంసీ అధికారులు గతంలో రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. కానీ అండర్ పాత్‌వేల విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ స్థలాలు తమ పరిధిలో లేవని హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చూస్తుందని వారు చెబుతున్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తం

పద్మనాభం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. లీలాప్రసాద్ సూచించారు. సోమవారం ఆయన పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి సోకిన వారు తీవ్రమైన తలనొప్పి. జ్వరం, ఒళ్లు నొప్పులు. శరీరంపై దద్దుర్లు వంటి వాటితో బాధపడతారని తెలిపారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రతించాలని సూచించారు.

భగవద్గీతపై ప్రచారం

మధురవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన విజ్ఞాన వేదిక (విశాఖపట్నం) కమిటీ సభ్యులు మధురవాడ ఆర్‌టీసీ కాలనీలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు శ్రీనివాస్, నాగమణి, దేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక గ్రంథం సారాంశం తెలుసుకోవాలని కోరారు.

15వ తేదీలోగా హిందీ పరీక్ష ఫీజు చెల్లించాలి

భీమునిపట్నం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారత హిందీ ప్రచార సభ చెన్నై వారు నిర్వహించే హిందీ పరీక్షలకు ఈనెల 15వ తేదీ వరకూ ఫీజు చెల్లింపునకు గడువు విధించినట్టు ఆదర్శ హిందీ ప్రేమి మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎస్‌ఆర్ కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హిందీ లోయరు పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, ప్రవేశిక, హయ్యర్ పరీక్షలైన విశారద, ప్రవీణ, పూర్వార్థ, ఉత్తరార్థ పరీక్షలకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు గడువులోగా చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలకు 8985647419 నంబరును సంప్రతించాలని సూచించారు.

హక్కులపై అవగాహన

సాగర్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరమని విశాఖ యూత్ కన్స్యూమర్ డిసి ప్లెయిన్ అసోసియేషన్ చైర్మన్ మర్రి సత్యనారాయణ అన్నారు. గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పిజి కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రుషికొండ ఎంపీపీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరంలో భాగంగా సోమవారం వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. తొలుత పెద్ద రుషికొండలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేశారు.

రేకిల్లు దగ్ధం

కొమ్మాది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని కార్పెంటర్స్ కాలనీలో సోమవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో రేకుల ఇల్లు పూర్తిగా కాలిపోయింది. కాలనీలోని విజయ అనే మహిళ రేకుల ఇంట్లో నివసిస్తోంది. ఆమె ఇంట్లో ఉన్న ఫ్రిజ్ నుంచి మంటలు రావడంతో సమీపంలో ఉన్న విద్యుత్ ఉపకరణాలతో పాటు వంటపాత్రలు, దుస్తులు కాలిపోయాయి.

పీజీఆర్‌ఎస్‌లో 12 వినతుల స్వీకరణ

మధురవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ జోన్-2 కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 12 వినతులు అందినట్టు ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. సివిల్ వర్క్‌లకు సంబంధించి మూడు, తాగునీటి సరఫరా విభాగానికి మూడు, రెవెన్యూ విభాగానికి మూడు, పట్టణ ప్రణాళిక విభాగం, ప్రజారోగ్య, యూసీడీ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు అందాయి. అర్జీలపై సమగ్ర విచారణ జరిపించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్టు జడ్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పాల్గొన్నారు.

జోన్ వన్‌లో ఒకే ఒక్క అర్జీ

భీమునిపట్నం : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు ఒకే ఒక అర్జీ అందింది. జడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒక్క ఫిర్యాదు మాత్రమే వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, పబ్లిక్ వర్క్స్ డీఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా సంక్షిప్త రామాయణ హవనం


స్వామివారికి పూజ చేస్తున్న అర్చకులు

సింహాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయం సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణ హవనం సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయం దేవాలయంలో ప్రభాతారాధనలు తరువాత సీతరామ లక్ష్మణ హనుమ ఉత్సవ మూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచారు. ఆగమశాస్త్ర విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి, జలాలతో ప్రోక్షణ జరిపారు. బింబారాధన, కలశారాధన, మండపారాధన చేసి ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం పండితులు రామాయణంలోని బాలకాండను పఠిస్తూ షడక్షరీ మంత్ర జపంతో హవనాన్ని జరిపారు. మహాపూర్ణాహుతి చేసి, ప్రధాన కలశంతో అర్చకస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అంతరాలయంలో మూలవిరాట్ వద్ద ఉంచి పూజలు చేశారు.

డెంగ్యూ దోమపై వీధి నాటిక ప్రదర్శన


నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

తగరపువలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కూడలిలో సోమవారం సాయంత్రం డెంగ్యూ దోమల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, నివారణ మార్గాలను తెలియజేస్తూ వీధి నాటిక ప్రదర్శించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు భద్రం ఫౌండేషన్ సభ్యులు నాటికను ప్రదర్శించారు. దోమలు ఎలా వ్యాప్తిస్తున్నాయి ? పరిసరాల పరిశుభ్రత ? నీటి నిల్వలు లేకుండా చూడడం వంటి అంశాలపై కళాకారులు ప్రజలకు వివరించారు. జీవీఎంసీ ముఖ్య ఆరోగ్య అధికారి నరేశ్‌కుమార్ ఆదేశాల మేరకు మలేరియా బయాలజిస్టులు ప్రసాదరెడ్డి, సాంబమూర్తి ఆధ్వర్యంలో ఈ నాటికను ప్రదర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శానిటరీ సిబ్బంది అశోక్, సన్యాసిరావు, హేమకుమార్ పాల్గొన్నారు. మొహిద్దీన్ భవానీరాజు, సముద్రం, కుమారి, డేవిడ్‌రాజు, వైశాలి నాటికలో నటించారు.

మ్యాచ్ ముగిసినా.. తొలగించని బారికేడ్లు


రత్నగిరి కాలనీ నుంచి స్టేడియంకు వెళ్లే రహదారి వద్ద అడ్డంగా ఉన్న బారికేడ్లు

మధురవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో శనివారం భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ నిర్వహణ దృష్ట్యా ప్రేక్షకులను అదుపు చేయడానికి స్టేడియం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. మ్యాచ్ ముగిసి రెండు రోజులు కావస్తున్నా.. రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి జాతీయ రహదారికి వెళ్లే కె. స్టాండు సమీపంలో బారికేడ్లు ఇంకా తొలగించలేదు. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్టేడియం ఎదురుగా వేసిన బారికేడ్లు కొంత తొలగించినా.. వీటిని మాత్రం పూర్తిగా తొలగించలేదు. ఈ విషయమై అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

పరకామణి చోరీ చిన్న విషయమా..? : గంటా నూకరాజు

భీమునిపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం హయాంలో తిరుమలలో జరిగిన పరకామణి చోరీ చాలా చిన్న విషయమని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొనడం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గ సంస్థగత ఎన్నికల పరిశీలకుడు గంటా నూకరాజు అన్నారు. సోమవారం ఆయన ఇక్కడి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం జరిగిన ఈ చోరీ సంఘటనపై అప్పటి వైసీపీ ప్రభుత్వం లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేసిన వ్యక్తికి, చోరీకి పాల్పడిన టీటీడీ ఉద్యోగికి మధ్య రాజీ కుదిర్చి, ఫైల్‌ను క్లోజ్ చేసేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఈ సంఘటనను తిరిగి వెలుగులోకి తీసుకువచ్చిందన్నారు. లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేసిన వ్యక్తి శవమై రైలు పట్టాల వద్ద కనిపించడం, చోరీకి పాల్పడిన ఉద్యోగి తప్పు జరిగిందని మీడియా ముందు ఒప్పుకోవడాన్ని జగన్ గుర్తు చేసుకోవాలని సూచించారు. ఈ సంఘటనపై జగన్, ఆ పార్టీ నాయకులు ఎందుకు కంగారు పడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

జ్వరాల విజృంభణ

... 5వ పేజీ తరువాయి

కుట్టడం వల్ల సోకుతుంది. ఈ కీటకం కుట్టిన చోట నల్లని మచ్చలు, దద్దుర్లు ఏర్పడతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కీటకం కుట్టిన వారం లేదా రెండు వారాల తరువాత తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, విరేచనాలు, వాంతులు, ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు వేధిస్తుంటాయంటున్నారు. అయితే, చాలామందికి ఎటువంటి మచ్చలు లేకుండానే స్క్రబ్ టైఫస్ పాజిటివ్ వస్తోందని, ఇప్పటివరకూ జిల్లాలో 130కుపైగా కేసులు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. గడిచిన నాలుగు వారాల్లో 20కుపైగా కేసులు నమోదైనట్టు చెబుతున్నారు. అయితే, అనధికారికంగా ఈ సంఖ్య మూడు రెట్లకుపైగానే ఉంటుందంటున్నారు.

చికెన్‌పాక్స్ కేసులు

గడిచిన కొద్దిరోజుల నుంచి చికెన్ పాక్స్ (అమ్మవారు/ఆటలమ్మ) కేసులు నమోదవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గుతోపాటు శరీరంపై ఎర్రని దద్దుర్లుతో చిన్నారులు బాధపడుతుంటారని వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు కనిపించిన రెండు,మూడు రోజుల్లోనే శరీరమంతా దద్దుర్లు వ్యాప్తి చెందుతాయని వైద్యులు చెబుతున్నారు.

మరిన్ని కేసులు..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 1,89,838 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా 113 మందికి పాజిటివ్ వచ్చింది. అలాగే 7,763 మందికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా, 286 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అదేవిధంగా 267 మందికి చికున్‌గున్యా పరీక్షలు నిర్వహించగా 16 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

చల్లని గాలిలో తిరగవద్దు

- డాక్టర్ వై.జ్ఞాన సుందరరాజు, జనరల్ ఫిజీషియన్

ప్రస్తుతం ఫ్లూ జ్వరాలు అధికంగా ఉన్నాయి. కాబట్టి, చల్లనిగాలుల బారినపడకుండా జాగ్రత్తపడాలి. ముఖ్యంగా చిన్నారులను సాయంత్రం వేళ బయటకు తీసుకువెళ్లకుండా ఉండాలి. అదే సమయంలో బయట ఆహారానికి దూరంగా ఉండడం మంచిది. స్క్రబ్ టైఫస్ కేసులు కూడా నమోదవుతున్నాయి. ఈ జ్వరాల పట్ల ఆందోళన అవసరం లేదు. అలాగని నిర్లక్ష్యం చేయకూడదు. కొన్నిసార్లు న్యుమోనియాకు దారితీస్తుంది. హార్ట్, లివర్, బ్రెయిన్‌పై తీవ్రమైన ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది. కాబట్టి, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల సలహా మేరకు పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి. అదే సమయంలో ఆందోళన కూడా పనికిరాదు. స్క్రబ్ టైఫస్ పాజిటివ్ వచ్చినవారు సాధారణ మందులతో కోలుకోవచ్చు.

ఎస్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం



చంద్ర పద్మావతి, పైడిరాజు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షురాలిగా చంద్ర పద్మావతి (ఎండాడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం), ప్రధాన కార్యదర్శిగా ఇమంది పైడిరాజు (అడవివరం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం)ను సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా పి. దేముడుబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా వి. శంకరరావు, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా బీవీఎన్ కుమార్, తాలాడ రామకృష్ణ, మహిళా కార్యదర్శులుగా సునీత, రత్నవల్లి, గౌరవ అధ్యక్షులుగా ప్రభాకర్, అప్పలరాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఆర్. జగదీశ్‌బాబు, సుంకర రమేశ్, చుక్కల స్వామి ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి సమ్మిట్‌కు పద్మనాభం కేజీబీవీ బాలిక

పద్మనాభం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థిని వనజ రాష్ట్రస్థాయి క్వెస్ట్ టు లెర్న్ సమ్మిట్‌కు ఎంపికైంది. ఈమేరకు సోమవారం ఆమె బెంగళూరులోని అమెజాన్‌లో జరిగే కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీరింగ్ స్కిల్స్‌లో భాగంగా గతంలో గీతం వర్సిటీలో నిర్వహించిన హ్యాక్ టు ఫ్యూచర్ అన్న కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొనగా వనజ ఉత్తమ ప్రతిభ చూపింది. ఈమేరకు క్వెస్ట్ అలియన్స్ జిల్లా కోఆర్డినేటరు కె. రమణి చౌదరితో బాలికను ఈనెల 9, 10 తేదీల్లో బెంగళూరులో జరిగే సమ్మిట్‌కు పంపించారు. డీఈఓ ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ చంద్రశేఖర్, జీసీడీఓ శ్రీదేవి, తదితరులు బాలికను అభినందించారు.

కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు

... 5వ పేజీ తరువాయి

అర్హతలు, నిబంధనలు కలిగిన కాంట్రాక్టర్లలో ఎవరు తక్కువకు కోట్ చేస్తే వారికి ప్రాజెక్టు నిర్వహణ అప్పగించాలి. అయితే భీమిలి సీసీఎస్ ప్రాజెక్టు విషయంలో అధికారులు దీనికి విరుద్ధంగా వ్యవహరించడం వివాదానికి తావిస్తోంది. నగరంలో నాలుగు జోన్లలో అమలవుతున్న సీసీఎస్ ప్రాజెక్టును భీమిలి జోన్‌లో కూడా అందుబాటులోకి తేవాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. దీనికోసం 15వ ఆర్థిక సంఘం నిధులతో భీమిలి జోన్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)లో సీసీఎస్ ప్రాజెక్టును ఏర్పాటుచేసిన సంస్థ గత ఏడాది అక్టోబరు 15 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయడంతో 15 రోజులు ట్రయల్ రన్ నిర్వహించి నవంబరు 1న జీవీఎంసీకి అప్పగించింది. అప్పటినుంచి మెకానికల్ విభాగం అధికారులు సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు టెండర్లు పిలిచి అర్హులను ఎంపికచేయాలి. కానీ గత ఏడాది నవంబరు ఒకటి నుంచి ఇప్పటివరకు సీసీఎస్ ప్రాజెక్టుకు టెండరు పిలవకుండా అస్మదీయులైన సంస్థకు నామినేషన్‌పై అప్పగిస్తూ వచ్చారు. సుమారు రూ.24 లక్షల విలువైన పనిని ఏడాదిపాటు నామినేషన్ పద్ధతిలో కొనసాగిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో మెకానికల్ విభాగం అధికారులు అప్రమత్తమై ఆగమేఘాల మీద భీమిలి సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు టెండరు తయారుచేసి, స్టాండింగ్ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించారు.

మేయర్ ప్రశ్నల వర్షం

దీనిపై చర్చ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావుతో పాటు కొందరు సభ్యులు ఏడాదిగా సీసీఎస్ ప్రాజెక్టును ఎవరు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. దీనికి ఎస్ఈ గోవిందరావు సమాధానం ఇస్తూ ఇకపై నిర్వహణకు టెండర్లు పిలుస్తున్నామని, గతంలో జరిగిన దానికి కాదని సమాధానం ఇవ్వడంతో మేయర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏడాదికి సుమారు రూ.24 లక్షలు ఖర్చవుతోందని ప్రతిపాదన పెట్టగా...ఏడాదిగా ఎవరు నిర్వహించారు? టెండరు పిలిచారా? అని తిరిగి ప్రశ్నించేసరికి స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో ఆ ప్రాజెక్టును స్వయంగా పరిశీలిస్తామని, ఏడాదిలో ఎంత బిల్లులు చెల్లించారో వివరాలు అందజేయాలని స్పష్టంచేశారు. సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు టెండరు పిలవకుండా నామినేషన్‌పై అప్పగించడంలో మతలబు ఏమిటనే దానిపై స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ఇతర అధికారులతోపాటు సభ్యులు సైతం చర్చించుకుంటున్నారు.

స్టీల్‌ప్లాంటులో సీసీ టీవీ కెమెరాలు

... 5వ పేజీ తరువాయి

చూపించి ప్లాంటు చరిత్రలో తొలిసారి ఓ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలావుండగా శనివారం రాత్రి మూడో నంబరు బ్యాటరీలో ఓవెన్ చార్జింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. దీంతో 22 పుషింగ్‌లకుగాను 18 మాత్రమే వచ్చాయి. ఇలా ప్రతి విభాగంలో పరిమితికి మించి ఒత్తిడి పెట్టడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉత్పత్తి తగ్గిపోతోంది. ఇది ఉద్యోగులు, కార్మికుల కుట్రగా యాజమాన్యం చిత్రీకరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్లాంటు మొత్తం ఎక్కడికక్కడ సీసీ టీవీ కెమెరాలు పెట్టాల్సి ఉందని యాజమాన్యం కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపింది. స్టీల్ ప్లాంటు 25 వేల ఎకరాల్లో విస్తరించి ఉండగా 267 కి.మీ. పొడవున సీసీ టీవీ కెమెరాలు పెట్టాలని యాజమాన్యం చెబుతోంది. పరిశ్రమల్లో సాధారణంగా ప్రతి 100 మీటర్లకు ఒక కెమెరా పెడతారు. అయితే విభాగాల లోపల ఏమి జరుగుతున్నదో తెలియాలంటే...అంతకు రెట్టింపు సంఖ్యలో సీసీ టీవీ కెమెరాలు అవసరం అవుతాయి. గతంలో ఎన్నడూ ఇలా లేదని, ఇప్పుడు అనుమానాల నివృత్తి కోసం ఈ సీసీ టీవీ కెమెరాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించడం అవసరమా?...అని బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నారు. ఏర్పాటుచేస్తే సరిపోదని, వాటి నిర్వహణ, మానటరింగ్ చాలా పెద్ద విషయమని అంటున్నారు. ఇంకో 20 రోజుల్లో పదవీ కాలం పూర్తయిపోయే ఇన్‌చార్జి సీఎండీ అనుమానాల నివృత్తి కోసం కోట్ల రూపాయల వ్యయం దండగ అని అభిప్రాయపడుతున్నారు. ప్లాంటులో జరిగే విషయాలపై సీఎండీ ఇచ్చే నివేదికలు ఒకలా ఉంటే...ఉద్యోగ సంఘాలు చెబుతున్న అంశాలు వేరొక విధంగా ఉంటున్నాయని ఏది వాస్తవమో తెల్సుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఇదిలావుండగా ప్రస్తుత యాజమాన్యంలో సీఎండీ సక్సేనా గత ఏడాది కాలంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి వల్ల ప్లాంటుపై పడిన ఆర్థిక భారంపై సీబీఐతో వెంటనే విచారణ చేయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయన పదవీ విరమణ చేసిన తరువాత విచారణ చేపట్టినా ప్రయోజనం ఉండదని ఇప్పుడే దానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి కార్మిక సంఘాలు లేఖలు రాశాయి. ఈ నేపథ్యంలో సీఎండీకి పదవి కాలం పొడిగించే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది.

సైక్లింగ్ ట్రాక్‌లు

... 5వ పేజీ తరువాయి

విస్తరించకుండా సైకిళ్ల కోసం మార్గం ఏర్పాటుచేస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదాలు తప్పవు.

సిరిపురంలో కనిపించని సైకిల్ ట్రాక్

విశాఖపట్నం స్మార్ట్ సిటీలో భాగంగా వీఎంఆర్‌డీఏ సిరిపురంలో తన కార్యాలయం సమీపాన ఫ్యూజన్ ఫుడ్స్ హోటల్ పక్క నుంచి ఆకాశవాణి కేంద్రం వరకు ఎడమ వైపున సైకిల్ ట్రాక్‌ను 2018లో ఏర్పాటు చేసింది. 300 మీటర్ల పొడవు, ఏడు అడుగుల వెడల్పున ఆకుపచ్చ రంగు రోడ్డుపై పూసి, దానిపై సైకిల్ బొమ్మలను వేసింది. దానినే సైకిల్ ట్రాక్‌గా ప్రచారం చేశారు. ఆ తరువాత జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన హరినారాయణ బీచ్ రోడ్డులో సైకిళ్లు తొక్కడం అలవాటు చేయాలని 100 కొత్త సైకిళ్లను కొని నాలుగు ప్రాంతాల్లో పెట్టి ఆసక్తి కలిగిన వారికి ఉచితంగా వాటిని ఇవ్వడం ప్రారంభించారు. కాళీమాత ఆలయం, పాండురంగాపురం, వైఎంసీఏ ప్రాంతాల్లో ఒక్కోచోట 25 సైకిళ్లకు అందుబాటులో ఉంచారు. పేర్లు నమోదు చేసుకుంటే సైకిళ్లను తొక్కడానికి ఇచ్చేవారు. ఆ ముచ్చట కూడా మూన్నాళ్లగానే మారింది. ఆ 100 సైకిళ్లు ఏమయ్యాయో కూడా తెలియదు. సైకిళ్లను ప్రోత్సహిస్తున్నామని చెప్పడానికి జీవీఎంసీ కమిషనర్లు ఆశీల్‌మెట్టలో సంపత్ వినాయకుడి ఆలయం సమీపానున్న బంగ్లా నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ప్రతి సోమవారం సైకిల్‌పై వచ్చేవారు. ఈ ముచ్చట్లన్నీ తీరిపోయాయి. ఇప్పుడు మళ్లీ కొత్త సైకిళ్లను కొనడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అయ్యప్ప దేవాలయం వార్షికోత్సవం రేపు

భీమునిపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్‌లో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం వార్షికోత్సవం ఈనెల 10న నిర్వ హించనున్నట్టు ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు నుసరాపు కామేశ్వర మాధవశాస్త్రి తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

22వ వార్డులో తాగునీరు బంద్

» నిర్మాణాలు చేపడుతున్నామంటూ పబ్లిక్ వాటర్ ట్యాప్‌లు కట్ చేసిన జీవీఎంసీ సిబ్బంది » నీరు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు, చిరువర్తకులు

మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో ప్రజలు వినియోగించే తాగునీటిని బంద్ చేశారు. ఏళ్ల తరబడి స్థానికులు వినియోగిస్తున్న పబ్లిక్ మున్సిపల్ వాటర్ ట్యాప్‌లను పీకేశారు. దీంతో మంచినీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వార్డులో ప్రజల తాగునీటి వినియోగానికి జీవీఎంసీ వాటర్ విభాగం అధికారులు పిఠాపురం కాలనీ కళాభారతి, ముత్తూట్ ఫైనాన్స్, కాయగూరల బజార్ వద్ద మూడు పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. బజార్‌లో 52 స్టాళ్లు ఏర్పాటు చేసి కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడే చేపలు, మటన్, చికెన్ దుకాణాలు ఉన్నాయి. వారంతా బజార్ వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ ట్యాప్ వద్ద మంచి నీరు పట్టుకుంటారు. ఆ నీటితోనే దాహార్తికి తీర్చుకుని తమ వ్యాపార కార్యకలాపాలకువినియోగిస్తారు.

అలాగే ముత్తూట్ ఫైనాన్స్, కళాభారతి వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ వాటర్ ట్యాప్‌ల వద్ద చిరు వ్యాపారులు, టీ, టిఫిన్ దుకాణదారులు తాగునీటిని పట్టుకుని వినియోగిస్తారు. కాగా ఆయా ట్యాప్‌లు జీవీఎంసీ సిబ్బంది కట్ చేయడంతో వారంతా ప్రస్తుతం నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పిఠాపురంకాలనీ బజార్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్



పిఠాపురంకాలనీ బజార్ వద్ద కట్ చేసిన వాటర్ ట్యాప్



ముత్తూట్ ఫైనాన్స్ ఎదురుగా కట్ చేసి పబ్లిక్ మున్సిపల్ ట్యాప్

అభివృద్ధి పేరుతో ట్యాప్‌లు పీకేశారు..

కళాభారతి పక్కన వార్డు భవన నిర్మాణం పేరుతో ఇక్కడ ట్యాప్ కట్ చేశారు. అయితే వాటర్ ట్యాప్ కట్ చేస్తే ప్రత్యామ్నాయంగా ట్యాంక్ ఏర్పాటు చేయాలి. వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయకుండా ట్యాప్ తొలగించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. బజార్ వద్ద సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం పేరుతో ట్యాప్ తొలగించారు. పనులు ప్రారంభించకుండానే ట్యాప్ తీసేయడంతో వ్యాపారస్తులకు నీరు లేకుండా పోయింది. అంతేకాకుండా బజార్‌లో వ్యాపారస్తుల కోసం రూ.4 లక్షలతో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంటును అందుబాటులోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. ముత్తూట్ ఫైనాన్స్ ఎదురుగా డ్రైనేజీ నిర్మాణం కోసం ట్యాప్ తొలగించారు. కానీ ఇక్కడ కూడా పనులు ప్రారంభించలేదు. ప్రత్యామ్నాయ వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటర్‌ట్యాప్‌లు తొలగించాలి. అలాంటి ఏర్పాటు చేయకుండా, పనులు ప్రారంభించకుండా పబ్లిక్ వాటర్ ట్యాప్‌లు తొలగించి నీటి సరఫరా నిలిపి వేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. వ్యాపారస్తులకు తాగునీరు లేకుండా ఇబ్బందులు కలిగించడానికే జీవీఎంసీ సిబ్బంది ట్యాప్‌లు తొలగించారని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి పబ్లిక్ ట్యాప్‌లను పునరుద్ధరించి ఈ ప్రాంతంలో నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీవీఎంసీ పీజీఆర్‌ఎస్‌కు 86 వినతులు

» ఫిర్యాదులు/ వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం : వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్

వెంకోజీపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 86 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో పలు విభాగాల అధికారులతో కలిసి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఏడీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించి విభాగాదిపతులు ప్రజలు పెట్టుకున్న వినతులు/ ఫిర్యాదులను అదే రోజు పరిశీలించి, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, అందిపవిపతులపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని ఆదేశించారు. ప్రతివారం అదే ఫిర్యాదుల తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులు, జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

వీఎంఆర్డీఏలో..

సిరిపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ పరిధిలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్డీఏలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతులను స్వీకరించారు. ప్రజా దర్బార్‌కు వచ్చే వినతులను నిశితంగా పరిశీలించి, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన వారిని అప్యాయంగా పలుకరించి, తన చాంబర్‌లో కూర్చోబెట్టుకొని, వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రణాళిక, ఎస్టేట్ విభాగానికి ఎక్కువగా వినతులు వస్తు న్నందున, ఆయా సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీఎంఆర్డీఏ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా, నేరుగా తమను సంప్రదించవచ్చున్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే, వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. ప్రణాళిక విభాగం-8, పరిపాలన విభాగం-4, ఎస్టేట్ విభాగం-7, సాంకేతిక విభాగానికి సంబంధించి 2 వినతులు వచ్చాయి. ఆయా వినతులను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆయా విభాగాధిపతులకు సిఫార్సు చేశారు.

అటవీ సిబ్బంది కాసుల కక్కుర్తి!

» స్థానికులు పెంచుకునే కూరగాయలు, పువ్వుల చెట్ల నరికివేత
» ముడుపులు ముట్టజెప్పే వారికి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు



వాహనాల రాకపోకలకు అడ్డుగా వేసిన పిక్క

ఆరిలోవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులోని ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతం అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారింది. ఈ ప్రాంతమంతా కంబాలకొండకు సమీపంలో ఉండడంతో అటవీ శాఖ ఆధీనంలో ఇక్కడి భూములు అధిక శాతం ఉంటాయి. దీంతో ఈ ప్రాంతంలో నిత్యం అటవీ శాఖ గార్డులు పర్యవేక్షిస్తుంటారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారు అరటిచెట్లు, పువ్వుల మొక్కల పెంచుతుంటారు. వీటిని కొన్నిసార్లు అటవీ శాఖ సిబ్బంది నరికి వేస్తుంటారు. స్థానికులు కొందరు ఆవులు, గేదెలు పెంచుకునే క్రమంలో పాకలు వేసుకున్నా వాటిని తొలగించడం లేదని, కేవలం పువ్వులు, కూరగాయల మొక్కలు పెంచుకుంటే వాటిపై మాత్రం ప్రతాపం చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి పశువుల పెంపకం వల్ల పరిసరాలు అధ్వానంగా తయారవుతాయని, మొక్కల వల్ల ఎదురయ్యే సమస్యలు ఏమీ ఉండవని స్థానికులు అంటున్నారు. అటవీ శాఖ సిబ్బందికి ముడుపులు ముట్టచెప్పేవారికి మాత్రం ఏమీ అనడం లేదని, ఎలాంటి డబ్బులు ఇవ్వని వారు కూరగాయల చెట్లు, పువ్వుల మొక్కలు పెంచుకుంటే మాత్రం వాటిని నిబంధనల పేరు చెప్పి నరికివేసి ఇబ్బంది కలిగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

అలాగే ఇదే ప్రాంతంలో రోడ్డుకు ఆనుకొని నిర్మాణ సామగ్రి వేస్తున్నారని, రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న అధికారులు, అటవీ సిబ్బంది పట్టించుకోవడం లేదని అంటున్నారు. అటవీ శాఖ సిబ్బంది కేవలం కాసులు ఆశించే ఈ విధంగా వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



అటవీ శాఖ భూముల్లో పెంచుతున్న పశువులు

కనకమహాలక్ష్మికి రూ.67.79 లక్షల ఆదాయం



కనకమహాలక్ష్మి ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహారాణిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి 40 రోజుల్లో రూ.67,78,784 ఆదాయం భక్తుల కానుకల రూపంలో సమకూరింది. అలాగే 47.500 గ్రాముల బంగారం, 669 గ్రాముల వెండి వచ్చింది. సోమవారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో 29-10-25 నుంచి 8-12-25 వరకు 40 రోజులపాటు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించారు. కానుకల్లో విదేశీ డాలర్లు కూడా ఉన్నట్లు ఆలయ ఈవో శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. కానుకల లెక్కింపును ఈవో సహా దేవదాయ శాఖ అధికారి టి.అన్నపూర్ణ, ఎం.శ్రీధర్, పలువురు అధికారులు పర్యవేక్షించారు.

ఆటో సుందర్‌కు గవర్నర్ అభినందన



ఆటో సుందర్‌ను అభినందిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

గోపాలపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోత): రెండు దశాబ్దాలుగా గర్భిణులకు ఉచిత ఆటో ప్రయాణం కల్పిస్తున్న గోపాలపట్నం వాసి ఉల్లూరి సుందర్ (ఆటో సుందర్)ను డిల్లీలోని ఆదిలీలా ఫౌండేషన్ ఇటీవల భారతీయ సేవా అవార్డుతో సత్కరించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధి ఆదినారాయణ, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పాహుజ సమక్షంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆటో సుందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సుందర్ సేవలను కొనియాడిన గవర్నర్ ఆయనను అభినందించారు.

కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తదానం



మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా గల డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ బి.సుజాత మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభ్యం దొరకక ప్రాణాలు కోల్పోతుంటారన్నారు. అలాంటి వారి ప్రాణాలను విద్యార్థులు దానం చేసిన రక్తం రక్షిస్తుందన్నారు. అందుకే విధిగా రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి సుధాకరరావు, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు హేమంత్, చంద్రశేఖర్, నానాజీ, సుధీర్, బాలమురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌కు ఎన్నికల షెడ్యూల్ ఖరారు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ విశాఖకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని ప్రెసిడెంట్ వై.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత నవంబరు 21న ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా షెడ్యూల్ విడుదల చేశారని, అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. తాజాగా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ విశాఖపట్నం ఎన్నికల అధికారి నూతన షెడ్యూల్‌ను ప్రకటించారని తెలిపారు. దీని ప్రకారం ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. 18న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విశాఖలో పని చేస్తున్న ఏపీ ఎన్‌జీవో సభ్యులు పైన తెలిపిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా కేకే రాజు జన్మదిన వేడుకలు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కేకే రాజు

మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ కేకు కట్ చేయించి కేకే రాజుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటారు. అనంతరం కేకే రాజు పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు చూపించిన అభిమానానికి కృతజ్ఞుడై ఉంటానన్నారు. ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీవరుదు కళ్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, వాసుపల్లి గణేష్‌కుమార్, బాలరాజు, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, మాజీ మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో నెం.44ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

వెంకోజీపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మల్టీప్లెక్సులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు వంటి వాణిజ్య సంస్థల్లో మొదటి 30 నిమిషాలు ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చని, 30 నిమిషాలు దాటి గంటలోపు అయితే ఏదైనా షాపింగ్ చేసిన బిల్ లేదా సినిమా టికెట్ చూపించి ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చని ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెం.44ను కట్టుదిట్టంగా అమలు చేసే చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డీవీ రమణమూర్తికి అడ్వకేట్ కొండా రాజీవ్‌గాంధీ కోరారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాల్గొన్న కార్పొరేటర్, మంగవేణి, ఏఈ అప్పనాయుడు, టీడీపీ నేతలు, అధికారులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం, హనుమంతువాక జాతీయ రహదారి పక్కన 18వ వార్డు పరిధిలో ఉన్న శ్మశానవాటికకు వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులు రూ.40 లక్షలతో ఇక్కడ వంతెన నిర్మించనున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి నుంచి శ్మశానానికి మధ్య గెడ్డపై ఉన్న వంతెన బలహీనంగా మారింది. ఏ క్షణమైనా కూలిపోయే పరిస్థితికి చేరింది. రెండు నెలల్లో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి, పాత వంతెన కూల్చివేయనున్నారు. సుమారు 13 అడుగుల వెడల్పుతో వాహనం కూడా మరుభూమి దగ్గర వరకూ వెళ్లేలా వంతెన నిర్మించనున్నారు. కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు, జీవీఎంసీ సహాయక ఇంజనీర్ కె.అప్పలనాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, పళ్ల ఉమారాణి, నారు గోపి, బుడుమూరి గోవింద్, అప్పన్న చిన్న తదితరులు పాల్గొన్నారు.

గీత సామాజికవర్గానికి పదవులు కల్పిస్తాం

దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్



ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసి గీత సామాజికవర్గ సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీత సామాజికవర్గాలకు రానున్న రోజుల్లో రెండు జీవీఎంసీ కార్పొరేషన్ టికెట్లు, ఇతర పదవులు కల్పించడానికి కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ హామీ ఇచ్చారు. శివాజీపాలెంలో సోమవారం గీత కులసంఘ నాయకులు తమ వనసమరాధనకు హాజరవ్వాలని ఆయనకు ఆహ్వానం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ నియోజవర్గంలోని 27 దేవాలయాల్లో బోర్డు సభ్యులుగా గీత కులస్తులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో పిల్లి నూకరాజు, కట్టా మల్లేశ్వరరావు, ఎ.రాము, కృష్ణ, కండిపిల్లి శ్రీధర్, సుబ్బారావు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా షాలిమార్-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 07148 నంబరు గల రైలు ఈ నెల 8న చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ, రాత్రి 11.50 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07149 నంబరు గల రైలు ఈ నెల 10న మధ్యాహ్నం 12.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 2.40 గంటలకు దువ్వాడ, అదేరోజు (గురువారం) సాయంత్రం 4 గంటలకు చర్లపల్లి చేరుతుంది. 07182 నంబరు గల రైలు ఈ నెల 9న మధ్యాహ్నం 12.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 2.40 గంటలకు దువ్వాడ, అదేరోజు సాయంత్రం 4.00 గంటలకు చర్లపల్లి చేరుతుంది.

మేరీమాత ఉత్సవంలో తప్పిపోయిన చిన్నారులు

» గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



బాలుడు సుశాంత్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొండగుడి మేరీమాత ఉత్సవం సందర్భంగా భారీగా జనం తరలిరావడంతో రోజ్‌హిల్స్ కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు తప్పిపోవడంతో వారితల్లిదండ్రులు కొండపై ఏర్పాటుచేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదుచేయగా, తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కోసం హార్బర్ సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది గాలించి వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. జాన్వి అనే ఐదేళ్ల బాలికతో పాటు సుశాంత్ అనే ఐదేళ్ల బాలుడు జనాల్లో తప్పిపోగా, వారిని సీఐ సింహాద్రినాయుడు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. కొండపైకి లక్షలాది మంది తరలిరావడంతో రోజ్‌హిల్స్‌పై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరించి రోడ్డుపైన ఆటబొమ్మలు, ఇతర వస్తువులు విక్రయించేవారిని కొండపైన ఖాళీ ప్రదేశానికి తరలించడంతో తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా అడ్డుకున్నట్టయింది.

రైతుబజార్ నుంచి ఆన్‌లైన్ కూరగాయల డెలివరీకి స్పందన భేష్



కూరగాయల డెలివరీ కోసం ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :ఎంవీపీ కాలనీ రైతు బజార్ నుంచి ఆన్‌లైన్‌లో కూరగాయల విక్రయానికి మంచి స్పందన లభిస్తోంది. గడచిన అయిదు రోజుల్లో 170 మందికి ఇంటికే కూరగాయలను డెలివరీ చేశారు. రైతు బజార్‌కు అయిదు కిలోమీటర్ల దూరం వరకూ వీటిని డెలివరీ చేస్తున్నామని, ఎలాంటి అదనపు ధరలు ఉండవని డెలివరీ ఏజెన్సీ ప్రతినిధి శాస్త్రి వెలమూరి తెలిపారు. రైతుల నుంచి తీసుకున్న కూరగాయల్లో కూడా మంచివి గ్రేడింగ్ చేసి, వినియోగదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పైలట్‌గా విశాఖను ఎంపిక చేసినట్టు తెలిపారు. నగరంలో ఎంవీపీ రైతు బజార్‌లో తొలుత ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు వచ్చే స్పందన, సలహాలు, సూచనలను అనుసరించి తర్వాత పూర్తిస్థాయిలో కార్యాచరణ చేపట్టనున్నారు. రైతు బజారుకు, బహిరంగ విపణిలోని కూరగాయలకు కిలోకు కనీసం పది నుంచి 20లు వ్యత్యాసం ఉంటోంది. వినియోగదారులు రైతు బజార్‌కు రావడానికి సమయం, విపరీతమైన ట్రాఫిక్, కాలుష్యం, వ్యయం వంటివి లేకుండా ఆన్‌లైన్‌లోనే రైతు బజారు ధరలకు కూరగాయలు అందుబాటులోకి రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెబ్‌సైట్ https:// digirythubazaarap.com నుంచి కూరగాయలను బుక్ చేసుకోవచ్చు.

క్రీడాకారులు పూజిత, శేషుకు ఎమ్మెల్యే వెలగపూడి అభినందనలు

ఆరిలోవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బోపాల్‌లో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న రోలర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న పదో వార్డుకు చెందిన అన్న కనకల శేషు, రజితను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం అభినందనందించారు. ఈ ఇద్దరూ ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్ జిల్లా రోలర్ బాస్కెట్‌బాల్ పోటీల పతకాలు సాధించారు. అండర్-14 కేటగిరిలో కనకల శేషు రజత పతకం (వెండి), అండర్ 11 విభాగంలో కనకల పూజిత స్వర్ణ పతకం సాధించారు. ఈ నేపథ్యంలో వీరి తల్లిదండ్రులు నరసింహమూర్తి దంపతులు పిల్లలతో పాటు ఎమ్మెల్యే వెలగపూడిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి), మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రెండ్** : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 37, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, గుత్తి/రవి వంకాయలు 34, బెండకాయలు 58, పచ్చిమిర్చి 42, బజ్జి పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 64, బరబాటి 42, పోటల్స్ 54, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 40, బద్ద చిక్కుడు 44, దోస కాయలు 22, పోటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 60, కీర దోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడ దుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 54, గ్రీన్‌పీస్ బటాని 100, గోరు చిక్కుడు 48, కూర పెండలం 38, పనస పొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ మీట్‌కు వేదవ్యాస్

» కోచ్‌గా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అథ్లెటిక్స్ కోచ్ వైకుంఠరావు



వేదవ్యాస్



వైకుంఠరావు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి విశాఖకు చెందిన కె.వేదవ్యాస్ ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి బిహార్‌లో జరగనున్న ఈ టోర్నీలో వేదవ్యాస్ 5 వేల మీటర్లు, 10 వేల మీటర్ల ఈవెంట్లలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు.

జిల్లా కోర్టులో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న వేదవ్యాస్ గతంలో జాతీయ చాంపియన్‌గా నిలిచాడు. వేదవ్యాస్‌కు కోచ్‌గా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అథ్లెటిక్స్ కోచ్ వైకుంఠరావు వ్యవహరించనున్నారు.

వాల్తేరు రైల్వేలో డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా, ఏడీఆర్‌ఎం రామారావు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు రైల్వే ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత, 'భారతరత్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి డీఆర్‌ఎం లలిత్ బొహ్రా పూలమాల వేసి నివాళులు అర్పించారు.

డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం కె.రామారావు, సీనియర్ డీపీవో జుసుఫ్ కబీర్ అన్సారీ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. అలాగే డివిజన్‌లోని అన్ని ప్రధాన కార్యాలయాల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించినట్టు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఆంధ్రాకు పతకాల పంట



విజేతలకు పతకాలు అందజేసి అభినందించిన అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా రోలర్ సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ మెయిన్ రౌండ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో ఆంధ్ర చిన్నారులు పతకాల పంట పండించారు. శివాజీ పార్కు రింక్‌లో జరిగిన ఆర్టిస్టిక్ పోటీలకు జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ఏపీ రోలర్ స్కేటింగ్ సంఘం అధ్యక్షుడు సుధాకరరెడ్డి, డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ అతిథులుగా హాజరై తొలిరోజు విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు యార్లగడ్డ రవి, శీలం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు: ఫిగర్ స్కేటింగ్...బాలికల 6-8 ఏజ్ గ్రూప్‌లో మిషిక మోది (గుజరాత్), వి.చాందిని ప్రణీత (ఆంధ్ర), టి.అనన్య ఆశిష్ (గుజరాత్); 8-10 విభాగంలో అరణ్య హేమల్ పాటిల్ (తెలంగాణ), జి.వర్షిణి, టి.ఆరోహి ఆశిష్; 10-12 విభాగంలో ఎ.రక్షిత (ఆంధ్ర), గుజల సుధీక్ష శాయి (ఆంధ్ర), మాన్వి శిషిర్ షా (గుజరాత్); బాలుర 6-8 విభాగంలో డి.ఆర్జిత్ (తెలంగాణ), కె.తమోజ్ఞ రామ్ (ఆంధ్ర), పైలా చంద్రశేఖర్ (ఆంధ్ర); 10-12 విభాగంలో ఎ.చేతన్ ఆశిష్ (ఆంధ్ర), నగిరెడ్డి మోక్షజ్ఞ నారాయణ (ఆంధ్ర), ప్రణవ్ బాలు (కేరళ);

ఫ్రీ స్కేటింగ్ బాలికల 6-8 ఏజ్ గ్రూప్‌లో పి.రుత్విక (తెలంగాణ), ఆకెళ్ల మహీర (ఆంధ్ర), వీర్ని భవ్య శ్రీ (ఆంధ్ర) స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

అప్రెంటీస్ మేళాలో 135 మంది అభ్యర్థులు ఎంపిక



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న అధికారులు

కంచరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రధాని మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాకు ఐటీఐ అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 342 మంది అభ్యర్థులు మేళాకు హాజరైనట్టు ప్రిన్సిపాల్ ఎన్.సోలమన్ పేర్కొన్నారు .స్టీల్ ప్లాంటు, కోరమండల్ తదితర ప్రభుత్వ సంస్థలతో పాటు వివిధ ప్రైవేటు సంస్థలు 15 మేళాలో పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు చేపట్టారు. మెరిట్ ప్రాతిపదికన 135 మంది అభ్యర్థులను ప్రాథమికంగా ఎంపిక చేశారు. వీరి ధ్రువపత్రాలను పరిశీలించి తుది ఎంపికలు చేయనున్నారు.ఈ మేళాలో వైస్ ప్రిన్సిపాల్ డి.వేంకటేశ్వరరావు, అప్రెంటీస్ అడ్వైజర్ యూఎస్ఎన్ మూర్తి, ట్రైనింగ్ ఆఫీసర్ హెచ్‌వీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా నిరంతర తాగునీటి సరఫరా పనులు



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

కంచరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి జాషువానగర్‌లో నిరంతర మంచి నీటి సరఫరా పనులను వేగవంతం చేస్తున్నారు. జాషువానగర్ ప్రాంతంలో అండర్ పైపు లైన్ కనెక్షన్లను సోమవారం సిబ్బంది చేపట్టారు. మెయిన్ రోడ్డు నుంచి వీధుల్లోకి నీటి సరఫరా కోసం 500 మిల్లీమీటర్ల పైపులైన్‌ను అమర్చారు. త్వరలో నగరంలో జరగనున్న 247 మంచినీటి సరఫరా పనులు వేగవంతం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ పనులను వార్డు టీడీపీ నాయకులు పర్యవేక్షించారు. వార్డు అధ్యక్షుడు బండి రంజిత్ ఇతక కమిటీ ప్రతినిధులు రమణ అప్పారావు, కోటి, జయప్రకాశ్, యమున, వెంకటరావు , ఎన్.అప్పారావు పనులను పరిశీలించి అధికారులకు సహకరించారు.

బుల్లయ్య కళాశాలలో ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయ్‌బిలిటీ ప్రారంభం

సీతమ్మధార, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలల్లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడం, పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా రూపొందించిన ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు పైథాన్ వెబ్ డెవలపర్స్ ట్రాక్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రైమీర్ బ్యాంకర్స్ ట్రాక్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. విద్యార్థులు పని తీరు సామర్థ్యం, విశ్వాసం, వృత్తి సిద్ధతను పెంచేందుకు 80 గంటల టెక్నికల్ ట్రైనింగ్, 20 గంటల సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్‌ను 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఐసీటీ అకాడమీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెడ్ డాక్టర్ ఎస్. దినకర్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పరిశ్రమ, అకాడమీ అంతరాన్ని తగ్గించేందుకు ఐసీటీ అకాడెమీ చేస్తున్న కృషిని వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా సాంకేతికతో కూడిన విద్యను అందిస్తున్నమని, ఈ అరుదైన అవకాశాన్ని అత్యంత క్రమశిక్షణతో ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్కే చక్రవర్తి, ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీటీ అకాడమీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెడ్ డాక్టర్ ఎస్.దినకర్‌రెడ్డి



డాక్టర్ ఎస్.దినకర్ రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న బుల్లయ్య కళాశాల యాజమాన్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు, భూపతిరావు


10, 11 తేదీల్లో ఘంటసాల సినీ గీతాలాపన

డాబాగార్డెన్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కళలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం ఆయన స్వరాంజలి అండ్ స్వరార్చన సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో ఘంటసాల 103వ జయంతి పురస్కరించుకుని ఘంటసాల గానలీల కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10, 11 తేదీల్లో డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో సాయంత్రం 6 గంటలకు ఘంటసాల గానలీల సినీ గీతాలాపన కార్యక్రమం ఉంటుందన్నారు. ఘంటసాల గీతాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపిస్తారని తెలిపారు. స్వరాంజలి అధినేత డి. భూపతిరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఇతర ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలోని గాయనీ గాయకులు కృష్ణంరాజు, పట్టం వెంకటేశ్, ఎంవీఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్ జోన్ టిటి పోటీలు

సాగర్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో దక్షిణ మండల (సౌత్ జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్ పోటీలు జరగనున్నట్టు గీతం క్యాంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్ కార్తీక్ తెలిపారు. సోమవారం ఆయన వర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో దక్షిణ భారతదేశంలోని 84 వర్సిటీల నుంచి 400 మంది క్రీడాకారిణులు పాల్గొంటారని, అందులో 50 మంది జాతీయ క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. కర్ణాటక నుంచి 28 జట్లు, తమిళనాడు నుంచి 22, ఏపీ నుంచి 18, తెలంగాణ, కేరళ నుంచి 7 జట్లు చొప్పున, పాండిచ్చేరి నుంచి 2 జట్లు పాల్గొనున్నాయని చెప్పారు. తెలంగాణలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఫైనల్ పోటీలు జరుగుతున్నాయన్నారు.గత ఏడాది విజేతలుగా నిలిచిన నాలుగు జట్లను క్వార్టర్ ఫైనల్స్‌లో నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. టిటి వరల్డ్ ర్యాంకింగ్ 84వ స్థానం పొందిన క్రీడాకారిణి యశశ్వినిగోర్పాడే ఈ పోటీల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారని చెప్పారు.

ఎస్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం





చంద్ర పద్మావతి, పైడిరాజు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షురాలిగా చంద్ర పద్మావతి (ఎండాడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం), ప్రధాన కార్యదర్శిగా ఇమంది పైడిరాజు (అడవివరం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం)ను సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా పి. దేముడుబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా వి. శంకరరావు, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా బీవీఎన్ కుమార్, తాలాడ రామకృష్ణ, మహిళా కార్యదర్శులుగా సునీత, రత్నవల్లి, గౌరవ అధ్యక్షులుగా ప్రభాకర్, అప్పలరాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఆర్. జగదీశ్‌బాబు, సుంకర రమేశ్, చుక్కల స్వామి ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి సమ్మిట్‌కు పద్మనాభం కేజీబీవీ బాలిక

పద్మనాభం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థిని వనజ రాష్ట్ర స్థాయి క్వెస్ట్ టు లెర్న్ సమ్మిట్‌కు ఎంపికైంది. ఈమేరకు సోమవారం ఆమె బెంగళూరులోని అమెజాన్‌లో జరిగే కార్యక్రమానికి బయలుదేరి వెళ్లా రు.అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీరింగ్ స్కిల్స్‌లో భాగంగా గతంలో గీతం వర్సిటీలో నిర్వహించిన హ్యాక్ టు ఫ్యూచర్ అన్న కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొనగా వనజ ఉత్తమ ప్రతిభ చూపింది.ఈమేరకు క్వెస్ట్ అలియన్స్ జిల్లా కోఆర్డినేటరు కె. రమణి చౌదరితో బాలికను ఈనెల 9, 10 తేదీల్లో బెంగళూరులో జరిగే సమ్మిట్‌కు పంపించారు.డీఈఓ ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ చంద్రశేఖర్, జీసీడీఓ శ్రీదేవి బాలికను అభినందించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం : కలెక్టర్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనకు అం దరూ సహకరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అన్ని శాఖ ల అధికారులతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తయారు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక చేపట్టిం దన్నారు. దీని ప్రకారం 2026 మార్చి 8వ తేదీ వరకు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో ర్యాలీలు, డిబెట్లు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సందేశాలు ఇవ్వాలని పోలీసు లకు సూచించారు. ఆలయాలు, మసీదులు, చర్చిల్లోనూ మత పెద్దలు బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

సైక్లింగ్ ట్రాక్‌లు

... 5వ పేజీ తరువాయి

విస్తరించకుండా సైకిళ్ల కోసం మార్గం ఏర్పాటుచేస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదాలు తప్పవు.

సిరిపురంలో కనిపించని సైకిల్ ట్రాక్

విశాఖపట్నం స్మార్ట్ సిటీలో భాగంగా వీఎంఆర్‌డీఏ సిరిపురంలో తన కార్యాలయం సమీపాన ఫ్యూజన్ ఫుడ్స్ హోటల్ పక్క నుంచి ఆకాశవాణి కేంద్రం వరకు ఎడమ వైపున సైకిల్ ట్రాక్‌ను 2018లో ఏర్పాటు చేసింది. 300 మీటర్ల పొడవు, ఏడు అడుగుల వెడల్పున ఆకుపచ్చ రంగు రోడ్డుపై పూసి, దానిపై సైకిల్ బొమ్మలను వేసింది. దానినే సైకిల్ ట్రాక్‌గా ప్రచారం చేశారు. ఆ తరువాత జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన హరినారాయణ బీచ్ రోడ్డులో సైకిళ్లు తొక్కడం అలవాటు చేయాలని 100 కొత్త సైకిళ్లను కొని నాలుగు ప్రాంతాల్లో పెట్టి ఆసక్తి కలిగిన వారికి ఉచితంగా వాటిని ఇవ్వడం ప్రారంభించారు. కాళీమాత ఆలయం, పాండురంగాపురం, వైఎంసీఏ ప్రాంతాల్లో ఒక్కోచోట 25 సైకిళ్లకు అందుబాటులో ఉంచారు. పేర్లు నమోదు చేసుకుంటే సైకిళ్లను తొక్కడానికి ఇచ్చేవారు. ఆ ముచ్చట కూడా మూన్నాళ్లగానే మారింది. ఆ 100 సైకిళ్లు ఏమయ్యాయో కూడా తెలియదు. సైకిళ్లను ప్రోత్సహిస్తున్నామని చెప్పడానికి జీవీఎంసీ కమిషనర్లు ఆశీల్‌మెట్టలో సంపత్ వినాయకుడి ఆలయం సమీపానున్న బంగ్లా నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ప్రతి సోమవారం సైకిల్‌పై వచ్చేవారు. ఈ ముచ్చట్లన్నీ తీరిపోయాయి. ఇప్పుడు మళ్లీ కొత్త సైకిళ్లను కొనడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంటులో సీసీ టీవీ కెమెరాలు?

... 5వ పేజీ తరువాయి

చూపించి ప్లాంటు చరిత్రలో తొలిసారి ఓ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలావుండగా శనివారం రాత్రి మూడో నంబరు బ్యాటరీలో ఓవెన్ చార్జింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. దీంతో 22 పుషింగ్‌లకు గాను 18 మాత్రమే వచ్చాయి. ఇలా ప్రతి విభాగంలో పరిమితికి మించి ఒత్తిడి పెట్టడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉత్పత్తి తగ్గిపోతోంది. ఇది ఉద్యోగులు, కార్మికుల కుట్రగా యాజమాన్యం చిత్రీకరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్లాంటు మొత్తం ఎక్కడికక్కడ సీసీ టీవీ కెమెరాలు పెట్టాల్సి ఉందని యాజమాన్యం కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపింది. స్టీల్ ప్లాంటు 25 వేల ఎకరాల్లో విస్తరించి ఉండగా 267 కి.మీ. పొడవున సీసీ టీవీ కెమెరాలు పెట్టాలని యాజమాన్యం చెబుతోంది. పరిశ్రమల్లో సాధారణంగా ప్రతి 100 మీటర్లకు ఒక కెమెరా పెడతారు. అయితే విభాగాల లోపల ఏమి జరుగుతున్నదో తెలియాలంటే...అంతకు రెట్టింపు సంఖ్యలో సీసీ టీవీ కెమెరాలు అవసరం అవుతాయి.

గతంలో ఎన్నడూ ఇలా లేదని, ఇప్పుడు అనుమానాల నివృత్తి కోసం ఈ సీసీ టీవీ కెమెరాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించడం అవసరమా?...అని బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నారు. ఏర్పాటుచేస్తే సరిపోదని, వాటి నిర్వహణ, మానటరింగ్ చాలా పెద్ద విషయమని అంటున్నారు. ఇంకో 20 రోజుల్లో పదవీ కాలం పూర్తయిపోయే ఇన్‌చార్జి సీఎండీ అనుమానాల నివృత్తి కోసం కోట్ల రూపాయల వ్యయం దండగ అని అభిప్రాయపడుతున్నారు. ప్లాంటులో జరిగే విషయాలపై సీఎండీ ఇచ్చే నివేదికలు ఒకలా ఉంటే...ఉద్యోగ సంఘాలు చెబుతున్న అంశాలు వేరొక విధంగా ఉంటున్నాయని ఏది వాస్తవమో తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఇదిలావుండగా ప్రస్తుత యాజమాన్యంలో సీఎండీ సక్సేనా గత ఏడాది కాలంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి వల్ల ప్లాంటుపై పడిన ఆర్థిక భారంపై సీబీఐతో వెంటనే విచారణ చేయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయన పదవీ విరమణ చేసిన తరువాత విచారణ చేపట్టినా ప్రయోజనం ఉండదని ఇప్పుడే దానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి కార్మిక సంఘాలు లేఖలు రాశాయి. ఈ నేపథ్యంలో సీఎండీకి పదవి కాలం పొడిగించే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది.

21న పల్స్ పోలియో

... 5వ పేజీ తరువాయి

టీమ్‌లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో 85 హైరిస్క్ ప్రాంతాల్లో 6,497 మంది చిన్నారులు ఉన్నారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పోలియో చుక్కలు వేయాలన్నారు. సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. పల్స్ పోలియోపై సినిమా థియేటర్లలో స్లైడ్స్, బస్ స్టేషన్, రైల్వే స్టేషన్‌లలో సీసీటీవీలు ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్‌వో సత్తిబాబు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శంకర ప్రసాద్, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు, జిల్లా ఇమ్యునేషన్ అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియా తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన ఉక్కు నిర్వాసితులు

... 5వ పేజీ తరువాయి

వారి కుటుంబ సభ్యులతో ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. త్వరలో నిర్వాసిత నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించారు.

న్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి..

స్టీల్‌ప్లాంటు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తీరని అన్యాయం జరిగిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. నిర్వాసితుల ధర్నాకు మద్దతు తెలిపిన పలు రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నలభై ఏళ్లుగా నిర్వాసితులు ఉపాధి కోసం ఆశతో ఎదురుచూస్తున్నా, న్యాయం జరగలేదన్నారు. నిర్వాసితుల గోడును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అర్థం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నాలో నిర్వాసిత నాయకులు పితాని భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, దేముడు, వంశీకృష్ణ, జగన్, రమణ, రాజకీయ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి రవి, కోమటి శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, గవర వెంకటరమణ, ప్రియాంక, గాయత్రీదేవి, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, పరంధామయ్య పాల్గొన్నారు.

రాజకీయ ప్రసంగాలను అడ్డుకున్న నిర్వాసితులు....

ధర్నాకు సంఘీభావం తెలిపిన కొంతమంది నాయకులు రాజకీయ విమర్శలు చేయడంతో నిర్వాసితులు వద్దని అడ్డుకున్నారు. కేవలం నిర్వాసితుల గురించి మాట్లాడాలని, రాజకీయాలు వద్దని గట్టిగా కేకలు వేయటంతో వారు ప్రసంగాలు ఆపేశారు. నిర్వాసితులకు అండగా ఉంటామని, పోరాటాల్లో పాల్గొంటామని ప్రకటించారు.

నిర్వాసితులను నిర్లక్ష్యం చేయటం తగదు..మాజీ మంత్రి

ఉక్కు నిర్వాసితులను యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. నిర్వాసితులకు ఇంత అన్యాయం జరుగుతుందని నాడు అనుకోలేదని, మంచి జరుగుతుందని భావించామని వ్యాఖ్యానించారు. తన వయస్సు సహకరించినంత వరకు ఉక్కు నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఉద్యమిస్తానని పేర్కొన్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

నిర్వాసితుల ధర్నా నేపథ్యంలో సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. సౌత్ పరిధిలోని అన్ని స్టేషన్‌ల నుంచి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

... 5వ పేజీ తరువాయి

కుట్టడం వల్ల సోకుతుంది. ఈ కీటకం కుట్టిన చోట నల్లని మచ్చలు, దద్దుర్లు ఏర్పడతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కీటకం కుట్టిన వారం లేదా రెండు వారాల తరువాత తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, విరేచనాలు, వాంతులు, ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు వేధిస్తుంటాయంటున్నారు. అయితే, చాలామందికి ఎటువంటి మచ్చలు లేకుండానే స్క్రబ్ టైఫస్ పాజిటివ్ వస్తోందని, ఇప్పటివరకూ జిల్లాలో 130కుపైగా కేసులు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. గడిచిన నాలుగు వారాల్లో 20కుపైగా కేసులు నమోదైనట్టు చెబుతున్నారు. అయితే, అనధికారికంగా ఈ సంఖ్య మూడు రెట్లకుపైగానే ఉంటుందంటున్నారు.

చికెన్‌పాక్స్ కేసులు

గడిచిన కొద్దిరోజుల నుంచి చికెన్ పాక్స్ (అమ్మవారు/ఆటలమ్మ) కేసులు నమోదవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గుతోపాటు శరీరంపై ఎర్రని దద్దుర్లతో చిన్నారులు బాధపడుతుంటారని వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు కనిపించిన రెండు,మూడు రోజుల్లోనే శరీరమంతా దద్దుర్లు వ్యాప్తి చెందుతాయని వైద్యులు చెబుతున్నారు.

మరిన్ని కేసులు..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 1,89,838 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా 113 మందికి పాజిటివ్ వచ్చింది. అలాగే 7,763 మందికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా, 286 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అదేవిధంగా 267 మందికి చికున్‌గున్యా పరీక్షలు నిర్వహించగా 16 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

చల్లని గాలిలో తిరగవద్దు

- డాక్టర్ వై.జ్ఞాన సుందరరాజు, జనరల్ ఫిజీషియన్

ప్రస్తుతం ఫ్లూ జ్వరాలు అధికంగా ఉన్నాయి. కాబట్టి, చల్లనిగాలుల బారిన పడకుండా జాగ్రత్తపడాలి. ముఖ్యంగా చిన్నారులను సాయంత్రం వేళ బయటకు తీసుకువెళ్లకుండా ఉండాలి. అదే సమయంలో బయట ఆహారానికి దూరంగా ఉండడం మంచిది. స్క్రబ్ టైఫస్ కేసులు కూడా నమోదవుతున్నాయి. ఈ జ్వరాల పట్ల ఆందోళన అవసరం లేదు. అలాగని నిర్లక్ష్యం చేయకూడదు. కొన్నిసార్లు న్యుమోనియాకు దారితీస్తుంది. హార్ట్, లివర్, బ్రెయిన్‌పై తీవ్రమైన ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది. కాబట్టి, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల సలహా మేరకు పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి. అదే సమయంలో ఆందోళన కూడా పనికిరాదు. స్క్రబ్ టైఫస్ పాజిటివ్ వచ్చిన వారు సాధారణ మందులతో కోలుకోవచ్చు.

కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు

... 5వ పేజీ తరువాయి

అర్హతలు, నిబంధనలు కలిగిన కాంట్రాక్టర్లలో ఎవరు తక్కువకు కోట్ చేస్తే వారికి ప్రాజెక్టు నిర్వహణ అప్పగించాలి. అయితే భీమిలి సీసీఎస్ ప్రాజెక్టు విషయంలో అధికారులు దీనికి విరుద్ధంగా వ్యవహరించడం వివాదానికి తావిస్తోంది. నగరంలో నాలుగు జోన్లలో అమలవుతున్న సీసీఎస్ ప్రాజెక్టును భీమిలి జోన్‌లో కూడా అందుబాటులోకి తేవాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. దీనికోసం 15వ ఆర్థిక సంఘం నిధులతో భీమిలి జోన్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)లో సీసీఎస్ ప్రాజెక్టును ఏర్పాటుచేసిన సంస్థ గత ఏడాది అక్టోబరు 15 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయడంతో 15 రోజులు ట్రయల్ రన్ నిర్వహించి నవంబరు 1న జీవీఎంసీకి అప్పగించింది. అప్పటినుంచి మెకానికల్ విభాగం అధికారులు సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు టెండర్లు పిలిచి అర్హులను ఎంపికచేయాలి. కానీ గత ఏడాది నవంబరు ఒకటి నుంచి ఇప్పటివరకు సీసీఎస్ ప్రాజెక్టుకు టెండరు పిలవకుండా అస్మదీయులైన సంస్థకు నామినేషన్‌పై అప్పగిస్తూ వచ్చారు. సుమారు రూ.24 లక్షల విలువైన పనిని ఏడాదిపాటు నామినేషన్ పద్ధతిలో కొనసాగిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో మెకానికల్ విభాగం అధికారులు అప్రమత్తమై ఆగమేఘాల మీద భీమిలి సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు టెండరు తయారుచేసి, స్టాండింగ్ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించారు.

మేయర్ ప్రశ్నల వర్షం

దీనిపై చర్చ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావుతో పాటు కొందరు సభ్యులు ఏడాదిగా సీసీఎస్ ప్రాజెక్టును ఎవరు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. దీనికి ఎస్ఈ గోవిందరావు సమాధానం ఇస్తూ ఇకపై నిర్వహణకు టెండర్లు పిలుస్తున్నామని, గతంలో జరిగిన దానికి కాదని సమాధానం ఇవ్వడంతో మేయర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏడాదికి సుమారు రూ.24 లక్షలు ఖర్చవుతోందని ప్రతిపాదన పెట్టగా...ఏడాదిగా ఎవరు నిర్వహించారు? టెండరు పిలిచారా? అని తిరిగి ప్రశ్నించేసరికి స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో ఆ ప్రాజెక్టును స్వయంగా పరిశీలిస్తామని, ఏడాదిలో ఎంత బిల్లులు చెల్లించారో వివరాలు అందజేయాలని స్పష్టంచేశారు.సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు టెండరు పిలవకుండా నామినేషన్‌పై అప్పగించడంలో మతలబు ఏమిటనే దానిపై స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ఇతర అధికారులతోపాటు సభ్యులు సైతం చర్చించుకుంటున్నారు.

22వ వార్డులో తాగునీరు బంద్

» నిర్మాణాలు చేపడుతున్నామంటూ పబ్లిక్ వాటర్ ట్యాప్‌లు కట్ చేసిన జీవీఎంసీ సిబ్బంది » నీరు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు , చిరువర్తకులు


పిఠాపురంకాలనీ బజార్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్


పిఠాపురంకాలనీ బజార్ వద్ద కట్ చేసిన వాటర్ ట్యాప్


ముత్తూట్ ఫైనాన్స్ ఎదురుగా కనెక్షన్ కట్ చేసిన పబ్లిక్ మున్సిపల్ ట్యాప్

మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో ప్రజలు వినియోగించే తాగునీటిని బంద్ చేశారు. ఏళ్ల తరబడి స్థానికులు వినియోగిస్తున్న పబ్లిక్ మున్సిపల్ వాటర్ ట్యాప్‌లను పీకేశారు. దీంతో మంచినీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వార్డులో ప్రజల తాగునీటి వినియోగానికి జీవీఎంసీ వాటర్ విభాగం అధికారులు పిఠాపురం కాలనీ కళాభారతి, ముత్తూట్ ఫైనాన్స్, కాయగూరల బజార్ వద్ద మూడు పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. బజార్‌లో 52 స్టాళ్లు ఏర్పాటు చేసి కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడే చేపలు, మటన్, చికెన్ దుకాణాలు ఉన్నాయి. వారంతా బజార్ వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ ట్యాప్ వద్ద మంచి నీరు పట్టుకుంటారు. ఆ నీటితోనే దాహార్తికి తీర్చుకుని తమ వ్యాపార కార్యకలాపాలకువినియోగిస్తారు.

అలాగే ముత్తూట్ ఫైనాన్స్, కళాభారతి వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ వాటర్ ట్యాప్‌ల వద్ద చిరు వ్యాపారులు, టీ, టిఫిన్ దుకాణదారులు తాగునీటిని పట్టుకుని వినియోగిస్తారు. కాగా ఆయా ట్యాప్‌లు జీవీఎంసీ సిబ్బంది కట్ చేయడంతో వారంతా ప్రస్తుతం నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అభివృద్ధి పేరుతో ట్యాప్‌లు పీకేశారు..

కళాభారతి పక్కన వార్డు భవన నిర్మాణం పేరుతో ఇక్కడ ట్యాప్ కట్ చేశారు. అయితే వాటర్ ట్యాప్ కట్ చేస్తే ప్రత్యామ్నాయంగా ట్యాంక్ ఏర్పాటు చేయాలి. వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయకుండా ట్యాప్ తొలగించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. బజార్ వద్ద సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం పేరుతో ట్యాప్ తొలగించారు. పనులు ప్రారంభించకుండానే ట్యాప్ తీసేయడంతో వ్యాపారస్తులకు నీరు లేకుండా పోయింది. అంతేకాకుండా బజార్‌లో వ్యాపారస్తుల కోసం రూ.4 లక్షలతో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంటును అందుబాటులోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. ముత్తూట్ ఫైనాన్స్ ఎదురుగా డ్రైనేజీ నిర్మాణం కోసం ట్యాప్ తొలగించారు. కానీ ఇక్కడ కూడా పనులు ప్రారంభించలేదు. ప్రత్యామ్నాయ వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటర్‌ట్యాప్‌లు తొలగించాలి. అలాంటి ఏర్పాటు చేయకుండా, పనులు ప్రారంభించకుండా పబ్లిక్ వాటర్ ట్యాప్‌లు తొలగించి నీటి సరఫరా నిలిపి వేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. వ్యాపారస్తులకు తాగునీరు లేకుండా ఇబ్బందులు కలిగించడానికే జీవీఎంసీ సిబ్బంది ట్యాప్‌లు తొలగించారని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి పబ్లిక్ ట్యాప్‌లను పునరుద్ధరించి ఈ ప్రాంతంలో నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతుబజార్ నుంచి ఆన్‌లైన్ కూరగాయల డెలివరీకి స్పందన భేష్


కూరగాయల డెలివరీ కోసం ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :ఎంవీపీ కాలనీ రైతు బజార్ నుంచి ఆన్‌లైన్‌లో కూరగాయల విక్రయానికి మంచి స్పందన లభిస్తోంది. గడచిన అయిదు రోజుల్లో 170 మందికి ఇంటికే కూరగాయలను డెలివరీ చేశారు. రైతు బజార్‌కు అయిదు కిలోమీటర్ల దూరం వరకూ వీటిని డెలివరీ చేస్తున్నామని, ఎలాంటి అదనపు ధరలు ఉండవని డెలివరీ ఏజెన్సీ ప్రతినిధి శాస్త్రి వెలమూరి తెలిపారు. రైతుల నుంచి తీసుకున్న కూరగాయల్లో కూడా మంచివి గ్రేడింగ్ చేసి, వినియోగదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పైలట్‌గా విశాఖను ఎంపిక చేసినట్టు తెలిపారు. నగరంలో ఎంవీపీ రైతు బజార్‌లో తొలుత ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు వచ్చే స్పందన, సలహాలు, సూచనలను అనుసరించి తర్వాత పూర్తిస్థాయిలో కార్యాచరణ చేపట్టనున్నారు. రైతు బజారుకు, బహిరంగ విపణిలోని కూరగాయలకు కిలోకు కనీసం పది నుంచి 20లు వ్యత్యాసం ఉంటోంది. వినియోగదారులు రైతు బజార్‌కు రావడానికి సమయం, విపరీతమైన ట్రాఫిక్, కాలుష్యం, వ్యయం వంటివి లేకుండా ఆన్‌లైన్‌లోనే రైతు బజారు ధరలకు కూరగాయలు అందుబాటులోకి రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెబ్‌సైట్ https:// digirythubazaarap.com నుంచి కూరగాయలను బుక్ చేసుకోవచ్చు.

క్రీడాకారులు పూజిత, శేషుకు ఎమ్మెల్యే వెలగపూడి అభినందనలు

ఆరిలోవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బోపాల్‌లో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న రోలర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న పదో వార్డుకు చెందిన అన్న కనకల శేషు, రజితను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం అభినందనందించారు. ఈ ఇద్దరూ ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్ జిల్లా రోలర్ బాస్కెట్‌బాల్ పోటీల పతకాలు సాధించారు. అండర్-14 కేటగిరిలో కనకల శేషు రజత పతకం (వెండి), అండర్ 11 విభాగంలో కనకల పూజిత స్వర్ణ పతకం సాధించారు. ఈ నేపథ్యంలో వీరి తల్లిదండ్రులు నరసింహమూర్తి దంపతులు పిల్లలతో పాటు ఎమ్మెల్యే వెలగపూడిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సినిమా గైడ్

● **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిలిత (శ్రీహరిపురం),

● **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).

● **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),

● **రాజు వెడ్స్ రాంబాయి / మస్టీపోలీసు** : జగదాంబ

● **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా

● **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి

● **ది గర్ల ఫ్రండ్** : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 37, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, గుత్తి/రవి వంకాయలు 34, బెండకాయలు 58, పచ్చిమిర్చి 42, బజ్జి పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 64, బరబాటి 42, పోటల్స్ 54, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 40, బద్ద చిక్కుడు 44, దోస కాయలు 22, పోటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 60, కీర దోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడ దుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 54, గ్రీన్‌పీస్ బటాని 100, గోరు చిక్కుడు 48, కూర పెండలం 38, పనస పొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 86 వినతులు

» ఫిర్యాదులు/ వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం : వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్

వెంకోజీపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 86 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో పలు విభాగాల అధికారులతో కలిసి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఏడీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించి విభాగాదిపతులు ప్రజలు పెట్టుకున్న వినతులు/ ఫిర్యాదులను అదే రోజు పరిశీలించి, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, అందివ విపతులపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని ఆదేశించారు. ప్రతివారం అదే ఫిర్యాదుల తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులు, జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

వీఎంఆర్డీఏలో..

సిరిపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ పరిధిలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్డీఏలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతులను స్వీకరించారు. ప్రజా దర్బార్‌కు వచ్చే వినతులను నిశితంగా పరిశీలించి, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన వారిని ఆప్యాయంగా పలుకరించి, తన చాంబర్‌లో కూర్చోబెట్టుకొని, వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రణాళిక, ఎస్టేట్ విభాగానికి ఎక్కువగా వినతులు వస్తు న్నందున, ఆయా సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీఎంఆర్డీఏ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా, నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే, వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. ప్రణాళిక విభాగం-8, పరిపాలన విభాగం-4, ఎస్టేట్ విభాగం-7, సాంకేతిక విభాగానికి సంబంధించి 2 వినతులు వచ్చాయి. ఆయా వినతులను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆయా విభాగాధిపతులకు సిఫార్సు చేశారు.

కనకమహాలక్ష్మికి రూ.67.79 లక్షల ఆదాయం


కనకమహాలక్ష్మి ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహారాణిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి 40 రోజుల్లో రూ.67,78,784 ఆదాయం భక్తుల కానుకల రూపంలో సమకూరింది. అలాగే 47.500 గ్రాముల బంగారం, 669 గ్రాముల వెండి వచ్చింది. సోమవారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో 29-10-25 నుంచి 8-12-25 వరకు 40 రోజులపాటు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించారు. కానుకల్లో విదేశీ డాలర్లు కూడా ఉన్నట్లు ఆలయ ఈవో శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. కానుకల లెక్కింపును ఈవో సహా దేవదాయ శాఖ అధికారి టి.అన్నపూర్ణ, ఎం.శ్రీధర్, పలువురు అధికారులు పర్యవేక్షించారు.

అటవీ సిబ్బంది కాసుల కక్కుర్తి!

» స్థానికులు పెంచుకునే కూరగాయలు, పువ్వుల చెట్ల నరికివేత

» ముడుపులు ముట్టజెప్పే వారికి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు


వాహనాల రాకపోకలకు అడ్డుగా వేసిన పిక్క

ఆరిలోవ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులోని ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతం అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారింది. ఈ ప్రాంతమంతా కంబాలకొండకు సమీపంలో ఉండడంతో అటవీ శాఖ ఆధీనంలో ఇక్కడి భూములు అధికశాతం ఉంటాయి. దీంతో ఈ ప్రాంతంలో నిత్యం అటవీ శాఖ గార్డులు పర్యవేక్షిస్తుంటారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారు అరటిచెట్లు, పువ్వుల మొక్కల పెంచుతుంటారు. వీటిని కొన్నిసార్లు అటవీ శాఖ సిబ్బంది నరికి వేస్తుంటారు. స్థానికులు కొందరు ఆవులు, గేదెలు పెంచుకునే క్రమంలో పాకలు వేసుకున్నా వాటిని తొలగించడం లేదని, కేవలం పువ్వులు, కూరగాయల మొక్కలు పెంచుకుంటే వాటిపై మాత్రం ప్రతాపం చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి పశువుల పెంపకం వల్ల పరిసరాలు అధ్వానంగా తయారవుతాయని, మొక్కల వల్ల ఎదురయ్యే సమస్యలు ఏమీ ఉండవని స్థానికులు అంటున్నారు. అటవీ శాఖ సిబ్బందికి ముడుపులు ముట్టచెప్పేవారికి మాత్రం ఏమీ అనడం లేదని, ఎలాంటి డబ్బులు ఇవ్వని వారు కూరగాయల చెట్లు, పువ్వుల మొక్కలు పెంచుకుంటే మాత్రం వాటిని నిబంధనల పేరు చెప్పి నరికివేసి ఇబ్బంది కలిగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

అలాగే ఇదే ప్రాంతంలో రోడ్డుకు ఆనుకొని నిర్మాణ సామగ్రి వేస్తున్నారని, రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న అధికారులు, అటవీ సిబ్బంది పట్టించుకోవడం లేదని అంటున్నారు. అటవీ శాఖ సిబ్బంది కేవలం కాసులు ఆశించే ఈ విధంగా వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.


అటవీ శాఖ భూముల్లో పెంచుతున్న పశువులు

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాల్గొన్న కార్పొరేటర్, మంగవేణి, ఏఈఈ అప్పనాయుడు, టీడీపీ నేతలు, అధికారులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం, హనుమంతువాక జాతీయ రహదారి పక్కన 18వ వార్డు పరిధిలో ఉన్న శ్మశానవాటికకు వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులు రూ.40 లక్షలతో ఇక్కడ వంతెన నిర్మించనున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి నుంచి శ్మశానానికి మధ్య గెడ్డపై ఉన్న వంతెన బలహీనంగా మారింది. ఏ క్షణమైనా కూలిపోయే పరిస్థితికి చేరింది. రెండు నెలల్లో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి, పాత వంతెన కూల్చివేయనున్నారు. సుమారు 13 అడుగుల వెడల్పుతో వాహనం కూడా మరుభూమి దగ్గర వరకూ వెళ్లేలా వంతెన నిర్మించనున్నారు. కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు, జీవీఎంసీ సహాయక ఇంజనీర్ కె.అప్పలనాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, పళ్ల ఉమారాణి, నారు గోపి, బుడుమూరి గోవింద్, అప్పన్న చిన్న తదితరులు పాల్గొన్నారు.

గీత సామాజికవర్గానికి పదవులు కల్పిస్తాం

దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్


ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసి గీత సామాజికవర్గ సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీత సామాజికవర్గాలకు రానున్న రోజుల్లో రెండు జీవీఎంసీ కార్పొరేషన్ టికెట్లు, ఇతర పదవులు కల్పించడానికి కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ హామీ ఇచ్చారు. శివాజీపాలెంలో సోమవారం గీత కులసంఘ నాయకులు తమ వనసమారాధనకు హాజరవ్వాలని ఆయనకు ఆహ్వానం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ నియోజవర్గంలోని 27 దేవాలయాల్లో బోర్డు సభ్యులుగా గీత కులస్తులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో పిల్లి నూకరాజు, కట్టా మల్లేశ్వరరావు, ఎ.రాము, కృష్ణ, కండిపిల్లి శ్రీధర్, సుబ్బారావు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా షాలిమార్-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 07148 నంబరు గల రైలు ఈ నెల 8న చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ, రాత్రి 11.50 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07149 నంబరు గల రైలు ఈ నెల 10న మధ్యాహ్నం 12.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 2.40 గంటలకు దువ్వాడ, అదేరోజు (గురువారం) సాయంత్రం 4 గంటలకు చర్లపల్లి చేరుతుంది. 07182 నంబరు గల రైలు ఈ నెల 9న మధ్యాహ్నం 12.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 2.40 గంటలకు దువ్వాడ, అదేరోజు సాయంత్రం 4.00 గంటలకు చర్లపల్లి చేరుతుంది.

మేరీమాత ఉత్సవంలో తప్పిపోయిన చిన్నారులు

» గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


బాలుడు సుశాంత్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొండగుడి మేరీమాత ఉత్సవం సందర్భంగా భారీగా జనం తరలిరావడంతో రోజ్‌హిల్స్ కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు తప్పిపోవడంతో వారితల్లిదండ్రులు కొండపై ఏర్పాటుచేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదుచేయగా, తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కోసం హార్బర్ సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది గాలించి వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. జాన్వి అనే ఐదేళ్ల బాలికతో పాటు సుశాంత్ అనే ఐదేళ్ల బాలుడు జనాల్లో తప్పిపోగా, వారిని సీఐ సింహాద్రినాయుడు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. కొండపైకి లక్షలాది మంది తరలిరావడంతో రోజ్‌హిల్స్‌పై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరించి రోడ్డుపైన ఆటబొమ్మలు, ఇతర వస్తువులు విక్రయించేవారిని కొండపైన ఖాళీ ప్రదేశానికి తరలించడంతో తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా అడ్డుకున్నట్టయింది.

ఆటో సుందర్‌కు గవర్నర్ అభినందన


ఆటో సుందర్‌ను అభినందిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

గోపాలపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోత): రెండు దశాబ్దాలుగా గర్భిణులకు ఉచిత ఆటో ప్రయాణం కల్పిస్తున్న గోపాలపట్నం వాసి ఉల్లూరి సుందర్ (ఆటో సుందర్)ను ఢిల్లీలోని ఆదిలీలా ఫౌండేషన్ ఇటీవల భారతీయ సేవా అవార్డుతో సత్కరించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధి ఆదినారాయణ, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పాహుజ సమక్షంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆటో సుందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సుందర్ సేవలను కొనియాడిన గవర్నర్ ఆయనను అభినందించారు.

కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తదానం



మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా గల డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ బి.సుజాత మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభ్యం దొరకక ప్రాణాలు కోల్పోతుంటారన్నారు. అలాంటి వారి ప్రాణాలను విద్యార్థులు దానం చేసిన రక్తం రక్షిస్తుందన్నారు. అందుకే విధిగా రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి సుధాకరరావు, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు హేమంత్, చంద్రశేఖర్, నానాజీ, సుధీర్, బాలమురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌కు ఎన్నికల షెడ్యూల్ ఖరారు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ విశాఖకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని ప్రెసిడెంట్ వై.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత నవంబరు 21న ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా షెడ్యూల్ విడుదల చేశారని, అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. తాజాగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ విశాఖపట్నం ఎన్నికల అధికారి నూతన షెడ్యూల్‌ను ప్రకటించారని తెలిపారు. దీని ప్రకారం ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. 18న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విశాఖలో పని చేస్తున్న ఏపీ ఎన్జీవో సభ్యులు పైన తెలిపిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా కేకే రాజు జన్మదిన వేడుకలు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కేకే రాజు

మద్దిలపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ కేకు కట్ చేయించి కేకే రాజుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటారు. అనంతరం కేకే రాజు పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు చూపించిన అభిమానానికి కృతజ్ఞుడై ఉంటానన్నారు. ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీవరుదు కళ్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, వాసుపల్లి గణేష్‌కుమార్, బాలరాజు, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, మాజీ మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో నెం.44ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

వెంకోజీపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మల్టీప్లెక్సులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు వంటి వాణిజ్య సంస్థల్లో మొదటి 30 నిమిషాలు ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చని, 30 నిమిషాలు దాటి గంటలోపు అయితే ఏదైనా షాపింగ్ చేసిన బిల్ లేదా సినిమా టికెట్స్ చూపించి ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చని ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెం.44ను కట్టుదిట్టంగా అమలు చేసే చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డీవీ రమణమూర్తికి అడ్వకేట్ కొండా రాజీవ్‌గాంధీ కోరారు.

PUBLIC NOTICE

It is to inform to the general public that my client Sri. Gowri Shankar Prajapati S/o Late Banwari Lal Prajapati is 1/4th legitimate share holder to the Item listed below properties who succeeded from his Late father Banwari Lal Prajapati and through Joint business on the names of the mother of my client Smt. Bhawari Devi Prajapati and his elder brothers Shyam Sundar Prajapati and Manohar Lal Prajapati.

Item No.1: A RCC slabbed shop on the name of Sri Rama General Stores in an extent of 40 Sq. Yds ground Floor bearing D.No.57-1-10, belongs to S.No. 13, Main Road, Kancharapalem village, Visakhapatnam, Ward No.56, SRO Visakhapatnam within the limits of GVMC. Bounded as Follows: North: Road, East: Property belongs to K Krishna bearing D.No.57-1-8, West: Property belongs to Prakash Rao bearing D.No.57-1-11, South: Property belongs to Atchuta Rao bearing D.No.57-1-14,9.

Item No.2: A RCC slabbed shop on the present name (Tenant) Maruthi Jewelers in an extent of 100 sq.yds consisting of ground and 1st floor bearing D.No. 56-1-70, belongs to S.No.13, Main Road, Kancharapalem village, Visakhapatnam, Ward No.56 SRO Visakhapatnam within the limits of GVMC. Bourded as Follows: North: Road, East Property belongs to Ommi Rammurthi and others consisting of D.No.56-1-69, West: Property belongs to others consisting of D.No.56-1-71, South: Gedda.

Item No.3: All that site measuring to an extent of 269 sq.yds an extent of 266 2/3 sq.yds or 222.968 sq.mts together with RCC house thereon consisting Ground Floor, measuring 1400 sft. And First Floor measuring 1800 sft and Second Floor measuring 400 sft. Bearing D.No.39-10-9, Assessment No. 1086236278 bearing plot No. 148 situated at Muralinagar Layout, approved by D.T.P.as L.T.P. No.30/66 & 41/69 covered by old S.No.54 and 55 New S.No.54 (As per satellite survey report) of Madhavadhara village within the limits of GVMC Area and SRO Dwarakanagar, Visakhapatnam District bounded as follows:

East: Plot No. 155, South: 149, West: 30 feet Road, North: Plot No. 147.

Item No.4: All that piece and parcel of vacant land bearing plot No.107 measuring an extent of 1250 Sq.yds or 1045.159 Sq.Mts situated at A.P.I.I.C IALA - Pedda Gantyada covered by S.No. 158, Pedda gantyada Village, SRO Anakapalle within the limits of GVMC bounded as follows: North: 40 feet Road, East: Rajana Prajapti,

West: Plot No. 106, South: Property belongs to Maheswari Udyog.

Item No.5: An extent of 370 sq.yds at kapuluppada, Bheemunipatnam Mandal, Visakhapatnam District (at present boundaries are not known).

Item No.6: An extent of Ac. 1.00 cents vacant land with plots division approved by VUDA belongs to S.No.85,86,87 of Asakapalli Village, Anakapalle District.

Item No.7: An extent of Ac.0.60 cents vacant land belongs to Devipuram Village, Anakapalle District.

Item No.8: Liquid cash Rs.50,00,000/- in account of Smt. Bhawari Devi

Item No.9: 2 kgs of gold consisting with the mother of my client Smt. Bhawari Devi.

Item No.10: Rs.70,00,000/- worth of stock under the custody of elder brother of my client Sri. Shyam Sundar Prajapati. Now it is reliably came to knowledge of my client that his elder brother Shyam Sundar Prajapati and Bhawari Devi Prajapati who is the mother of my client and his second elder brother Manohar Lal Prajapati and began to alienate the property without the knowledge of my client and other family members for their personal gains unlawfully without partitioning the property of 1/4th share to my client, such sale transactions or alienation of properties acquired from my client's father and through joint business without partition of 1/4th share belongs to my client shall not bind on my client and such transactions in respect of the Item No.1 to 10 schedule properties deemed to be null and void and such transactions, sale agreements, mortgage, sale deeds to the third parties are at their own risk and responsibilities. Since my client has initiated legal action against the other share holders mentioned supra and also got issued Regd. lawyer's notice on 02.09.2025 and the same was acknowledged and my client shall initiate legal action for such unlawful transaction in respect of the item listed 1 to 10 properties mentioned above both in civil and criminal courts of Law.

K.Demudu, Advocate
Ph : 9948090824

ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ మీట్‌కు వేదవ్యాస్

» కోచ్‌గా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అథ్లెటిక్స్ కోచ్ వైకుంఠరావు



వేదవ్యాస్ వైకుంఠరావు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి విశాఖకు చెందిన కె.వేదవ్యాస్ ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి బిహార్‌లో జరగనున్న ఈ టోర్నీలో వేదవ్యాస్ 5 వేల మీటర్లు, 10 వేల మీటర్ల ఈవెంట్లలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు.

జిల్లా కోర్టులో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న వేదవ్యాస్ గతంలో జాతీయ చాంపియన్‌గా నిలిచాడు. వేదవ్యాస్‌కు కోచ్‌గా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అథ్లెటిక్స్ కోచ్ వైకుంఠరావు వ్యవహరించనున్నారు.

వాల్తేరు రైల్వేలో డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఏడీఆర్ఎం రామారావు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు రైల్వే ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత, 'భారతరత్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా పూలమాల వేసి నివాళులు అర్పించారు.

డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం కె.రామారావు, సీనియర్ డీపీవో జుసుఫ్ కబీర్ అన్సారీ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. అలాగే డివిజన్‌లోని అన్ని ప్రధాన కార్యాలయాల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించినట్టు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఆంధ్రాకు పతకాల పంట

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా రోలర్ సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ మెయిన్ రౌండ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో ఆంధ్ర చిన్నారులు పతకాల పంట పండించారు. శివాజీ పార్కు రింక్‌లో జరిగిన ఆర్టిస్టిక్ పోటీలకు జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ఏపీ రోలర్ స్కేటింగ్ సంఘం అధ్యక్షుడు సుధాకరరెడ్డి, డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరక్టర్ అతిథులుగా హాజరై తొలిరోజు విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు యార్లగడ్డ రవి, శీలం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు పతకాలు అందజేసి అభినందించిన అతిథులు

విజేతలు: ఫిగర్ స్కేటింగ్...బాలికల 6-8 ఏజ్ గ్రూప్‌లో మిషిక మోది (గుజరాత్), వి.చాందిని ప్రణీత (ఆంధ్ర), టి.అనన్య ఆశిష్ (గుజరాత్); 8-10 విభాగంలో అరణ్య హేమల్ పాటిల్ (తెలంగాణ), జి.వర్షిణి, టి.ఆరోహి ఆశిష్; 10-12 విభాగంలో ఎ.రక్షిత (ఆంధ్ర), గుజల సుధిక్ష శాయి (ఆంధ్ర), మాన్సి శిషిర్ షా (గుజరాత్); బాలుర 6-8 విభాగంలో డి.ఆర్జిత్ (తెలంగాణ), కె.తమోజ్ఞ రామ్ (ఆంధ్ర), పైలా చంద్రశేఖర్ (ఆంధ్ర); 10-12 విభాగంలో ఎ.చేతన్ ఆశిష్ (ఆంధ్ర), నగిరెడ్డి మోక్షజ్ఞ నారాయణ (ఆంధ్ర), ప్రణవ్ బాలు (కేరళ);

ఫ్రీ స్కేటింగ్ బాలికల 6-8 ఏజ్ గ్రూప్‌లో పి.రుత్విక (తెలంగాణ), ఆకెళ్ల మహీర (ఆంధ్ర), వీర్ని భవ్య శ్రీ (ఆంధ్ర) స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

అప్రెంటీస్ మేళాలో 135 మంది అభ్యర్థులు ఎంపిక

కంచరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రధాని మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాకు ఐటీఐ అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 342 మంది అభ్యర్థులు మేళాకు హాజరైనట్టు ప్రిన్సిపాల్ ఎన్.సోలమన్ పేర్కొన్నారు .స్టీల్ ప్లాంటు, కోరమండల్ తదితర ప్రభుత్వ సంస్థలతో పాటు వివిధ ప్రైవేటు సంస్థలు 15 మేళాలో పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు చేపట్టారు. మెరిట్ ప్రాతిపదికన 135 మంది అభ్యర్థులను ప్రాథమికంగా ఎంపిక చేశారు. వీరి ధ్రువపత్రాలను పరిశీలించి తుది ఎంపికలు చేయనున్నారు.ఈ మేళాలో వైస్ ప్రిన్సిపాల్ డి.వేంకటేశ్వరరావు, అప్రెంటీస్ అడ్వైజర్ యూఎస్ఎన్ మూర్తి, ట్రైనింగ్ ఆఫీసర్ హెచ్‌వీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న అధికారులు

చురుగ్గా నిరంతర తాగునీటి సరఫరా పనులు

కంచరపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి జాషువానగర్‌లో నిరంతర మంచి నీటి సరఫరా పనులను వేగవంతం చేస్తున్నారు. జాషువానగర్ ప్రాంతంలో అండర్ పైపు లైన్ కనెక్షన్లను సోమవారం సిబ్బంది చేపట్టారు. మెయిన్ రోడ్డు నుంచి వీధుల్లోకి నీటి సరఫరా కోసం 500 మిల్లీమీటర్ల పైపులైన్‌ను అమర్చారు. త్వరలో నగరంలో జరగనున్న 247 మంచినీటి సరఫరా పనులు వేగవంతం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ పనులను వార్డు టీడీపీ నాయకులు పర్యవేక్షించారు. వార్డు అధ్యక్షుడు బండి రంజిత్ ఇతక కమిటీ ప్రతినిధులు రమణ అప్పారావు, కోటి, జయప్రకాశ్, యమున, వెంకటరావు , ఎస్.అప్పారావు పనులను పరిశీలించి అధికారులకు సహకరించారు.



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

బుల్లయ్య కళాశాలలో ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయ్‌బిలిటీ ప్రారంభం

సీతమ్మధార, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలల్లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడం, పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా రూపొందించిన ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు పైథాన్ వెబ్ డెవలపర్స్ ట్రాక్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రైమీర్ బ్యాంకర్స్ ట్రాక్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. విద్యార్థులు పని తీరు సామర్థ్యం, విశ్వాసం, వృత్తి సిద్ధతను పెంచేందుకు 80 గంటల టెక్నికల్ ట్రైనింగ్, 20 గంటల సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్‌ను 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఐసీటీ అకాడమీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెడ్ డాక్టర్ ఎస్.దినకర్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పరిశ్రమ, అకాడమీ అంతరాన్ని తగ్గించేందుకు ఐసీటీ అకాడెమీ చేస్తున్న కృషిని వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా సాంకేతికతో కూడిన విద్యను అందిస్తున్నమని, ఈ అరుదైన అవకాశాన్ని అత్యంత క్రమశిక్షణతో ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్కే చక్రవర్తి, ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీటీ అకాడమీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెడ్ డాక్టర్ ఎస్.దినకర్‌రెడ్డి



డాక్టర్ ఎస్.దినకర్ రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న బుల్లయ్య కళాశాల యాజమాన్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు, భూపతిరావు



10, 11 తేదీల్లో ఘంటసాల సినీ గీతాలాపన

డాబాగార్డెన్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కళలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం ఆయన స్వరాంజలి అండ్ స్వరార్చన సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో ఘంటసాల 103వ జయంతి పురస్కరించుకుని ఘంటసాల గానలీల కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10, 11 తేదీల్లో డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో సాయంత్రం 6 గంటలకు ఘంటసాల గానలీల సినీ గీతాలాపన కార్యక్రమం ఉంటుందన్నారు. ఘంటసాల గీతాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపిస్తారని తెలిపారు. స్వరాంజలి అధినేత డి. భూపతిరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఇతర ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలోని గాయనీ గాయకులు కృష్ణంరాజు, పట్టం వెంకటేశ్, ఎంవీఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్ జోన్ టిటి పోటీలు

సాగర్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో దక్షిణ మండల (సౌత్ జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్ పోటీలు జరగనున్నట్టు గీతం క్యాంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్ కార్తీక్ తెలిపారు. సోమవారం ఆయన వర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో దక్షిణ భారతదేశంలోని 84 వర్సిటీల నుంచి 400 మంది క్రీడాకారిణులు పాల్గొంటారని, అందులో 50 మంది జాతీయ క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. కర్ణాటక నుంచి 28 జట్లు, తమిళనాడు నుంచి 22, ఏపీ నుంచి 18, తెలంగాణ, కేరళ నుంచి 7 జట్లు చొప్పున, పాండిచ్చేరి నుంచి 2 జట్లు పాల్గొనున్నాయని చెప్పారు. తెలంగాణలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఫైనల్ పోటీలు జరుగుతున్నాయన్నారు.గత ఏడాది విజేతలుగా నిలిచిన నాలుగు జట్లను క్వార్టర్ ఫైనల్స్‌లో నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. టిటి వరల్డ్ ర్యాంకింగ్ 84వ స్థానం పొందిన క్రీడాకారిణి యశస్వినిగోర్పాడే ఈ పోటీల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారని చెప్పారు.

ఎస్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం

చంద్ర పద్మావతి, పైడిరాజు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షురాలిగా చంద్ర పద్మావతి (ఎండాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం), ప్రధాన కార్యదర్శిగా ఇమంది పైడిరాజు (అడవివరం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం)ను సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా పి. దేముడుబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా వి. శంకరరావు, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా బీవీఎన్ కుమార్, తాలాడ రామకృష్ణ, మహిళా కార్యదర్శులుగా సునీత, రత్నవల్లి, గౌరవ అధ్యక్షులుగా ప్రభాకర్, అప్పలరాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఆర్. జగదీశ్‌బాబు, సుంకర రమేశ్, చుక్కల స్వామి ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి సమ్మిట్‌కు పద్మనాభం కేజీబీవీ బాలిక

పద్మనాభం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థిని వనజ రాష్ట్రస్థాయి క్వెస్ట్ టు లెర్న్ సమ్మిట్‌కు ఎంపికైంది. ఈమేరకు సోమవారం ఆమె బెంగళూరులోని అమెజాన్‌లో జరిగే కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీరింగ్ స్కిల్స్‌లో భాగంగా గతంలో గీతం వర్సిటీలో నిర్వహించిన హ్యాక్ టు ఫ్యూచర్ అన్న కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొనగా వనజ ఉత్తమ ప్రతిభ చూపింది.ఈమేరకు క్వెస్ట్ అలియన్స్ జిల్లా కోఆర్డినేటరు కె. రమణి చౌదరితో బాలికను ఈనెల 9, 10 తేదీల్లో బెంగళూరులో జరిగే సమ్మిట్‌కు పంపించారు.డీఈఓ ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ చంద్రశేఖర్, జీసీడీఓ శ్రీదేవి బాలికను అభినందించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం : కలెక్టర్

మహారాణిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తయారు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక చేపట్టిం దన్నారు. దీని ప్రకారం 2026 మార్చి 8వ తేదీ వరకు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో ర్యాలీలు, డిబెట్లు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సందేశాలు ఇవ్వాలని పోలీసు లకు సూచించారు. ఆలయాలు, మసీదులు, చర్చిల్లోనూ మత పెద్దలు బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

సైక్లింగ్ ట్రాక్‌లు

... 5వ పేజీ తరువాయి

విస్తరించకుండా సైకిళ్ల కోసం మార్గం ఏర్పాటుచేస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదాలు తప్పవు.

సిరిపురంలో కనిపించని సైకిల్ ట్రాక్

విశాఖపట్నం స్మార్ట్ సిటీలో భాగంగా వీఎంఆర్‌డీఏ సిరిపురంలో తన కార్యాలయం సమీపాన ఫ్యూజన్ ఫుడ్స్ హోటల్ పక్క నుంచి ఆకాశవాణి కేంద్రం వరకు ఎడమ వైపున సైకిల్ ట్రాక్‌ను 2018లో ఏర్పాటు చేసింది. 300 మీటర్ల పొడవు, ఏడు అడుగుల వెడల్పున ఆకుపచ్చ రంగు రోడ్డుపై పూసి, దానిపై సైకిల్ బొమ్మలను వేసింది. దానినే 'సైకిల్ ట్రాక్'గా ప్రచారం చేశారు. ఆ తరువాత జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన హరినారాయణ బీచ్ రోడ్డులో సైకిళ్లు తొక్కడం అలవాటు చేయాలని 100 కొత్త సైకిళ్లను కొని నాలుగు ప్రాంతాల్లో పెట్టి ఆసక్తి కలిగిన వారికి ఉచితంగా వాటిని ఇవ్వడం ప్రారంభించారు. కాళీమాత ఆలయం, పాండురంగాపురం, వైఎంసీఏ ప్రాంతాల్లో ఒక్కోచోట 25 సైకిళ్లకు అందుబాటులో ఉంచారు. పేర్లు నమోదు చేసుకుంటే సైకిళ్లను తొక్కడానికి ఇచ్చేవారు. ఆ ముచ్చట కూడా మూన్నాళ్లగానే మారింది. ఆ 100 సైకిళ్లు ఏమయ్యాయో కూడా తెలియదు. సైకిళ్లను ప్రోత్సహిస్తున్నామని చెప్పడానికి జీవీఎంసీ కమిషనర్లు ఆశీల్‌మెట్టలో సంపత్ వినాయకుడి ఆలయం సమీపానున్న బంగ్లా నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ప్రతి సోమవారం సైకిల్‌పై వచ్చేవారు. ఈ ముచ్చట్లన్నీ తీరిపోయాయి. ఇప్పుడు మళ్లీ కొత్త సైకిళ్లను కొనడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంటులో సీసీ టీవీ కెమెరాలు?

... 5వ పేజీ తరువాయి

చూపించి ప్లాంటు చరిత్రలో తొలిసారి ఓ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలావుండగా శనివారం రాత్రి మూడో నంబరు బ్యాటరీలో ఓవెన్ చార్జింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. దీంతో 22 పుషింగ్‌లకు గాను 18 మాత్రమే వచ్చాయి. ఇలా ప్రతి విభాగంలో పరిమితికి మించి ఒత్తిడి పెట్టడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉత్పత్తి తగ్గిపోతోంది. ఇది ఉద్యోగులు, కార్మికుల కుట్రగా యాజమాన్యం చిత్రీకరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్లాంటు మొత్తం ఎక్కడికక్కడ సీసీ టీవీ కెమెరాలు పెట్టాల్సి ఉందని యాజమాన్యం కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపింది. స్టీల్ ప్లాంటు 25 వేల ఎకరాల్లో విస్తరించి ఉండగా 267 కి.మీ. పొడవున సీసీ టీవీ కెమెరాలు పెట్టాలని యాజమాన్యం చెబుతోంది. పరిశ్రమల్లో సాధారణంగా ప్రతి 100 మీటర్లకు ఒక కెమెరా పెడతారు. అయితే విభాగాల లోపల ఏమి జరుగుతున్నదో తెలియాలంటే...అంతకు రెట్టింపు సంఖ్యలో సీసీ టీవీ కెమెరాలు అవసరం అవుతాయి.

గతంలో ఎన్నడూ ఇలా లేదని, ఇప్పుడు అనుమానాల నివృత్తి కోసం ఈ సీసీ టీవీ కెమెరాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించడం అవసరమా?...అని బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నారు. ఏర్పాటుచేస్తే సరిపోదని, వాటి నిర్వహణ, మానటరింగ్ చాలా పెద్ద విషయమని అంటున్నారు. ఇంకో 20 రోజుల్లో పదవీ కాలం పూర్తయిపోయే ఇన్‌చార్జి సీఎండీ అనుమానాల నివృత్తి కోసం కోట్ల రూపాయల వ్యయం దండగ అని అభిప్రాయపడుతున్నారు. ప్లాంటులో జరిగే విషయాలపై సీఎండీ ఇచ్చే నివేదికలు ఒకలా ఉంటే...ఉద్యోగ సంఘాలు చెబుతున్న అంశాలు వేరొక విధంగా ఉంటున్నాయని ఏది వాస్తవమో తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఇదిలావుండగా ప్రస్తుత యాజమాన్యంలో సీఎండీ సక్సేనా గత ఏడాది కాలంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి వల్ల ప్లాంటుపై పడిన ఆర్థిక భారంపై సీబీఐతో వెంటనే విచారణ చేయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయన పదవీ విరమణ చేసిన తరువాత విచారణ చేపట్టినా ప్రయోజనం ఉండదని ఇప్పుడే దానికి శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి కార్మిక సంఘాలు లేఖలు రాశాయి. ఈ నేపథ్యంలో సీఎండీకి పదవి కాలం పొడిగించే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది.

21న పల్స్ పోలియో

... 5వ పేజీ తరువాయి

టీమ్‌లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో 85 హైరిస్క్ ప్రాంతాల్లో 6,497 మంది చిన్నారులు ఉన్నారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పోలియో చుక్కలు వేయాలన్నారు. సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. పల్స్ పోలియోపై సినిమా థియేటర్లలో స్లైడ్స్, బస్ స్టేషన్, రైల్వే స్టేషన్‌లలో సీసీటీవీలు ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్‌వో సత్తిబాబు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శంకర ప్రసాద్, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు, జిల్లా ఇమ్యునేషన్ అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియా తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన ఉక్కు నిర్వాసితులు

... 5వ పేజీ తరువాయి

వారి కుటుంబ సభ్యులతో ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. త్వరలో నిర్వాసిత నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించారు.

న్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి..

స్టీల్‌ప్లాంటు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తీరని అన్యాయం జరిగిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. నిర్వాసితుల ధర్నాకు మద్దతు తెలిపిన పలు రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నలభై ఏళ్లుగా నిర్వాసితులు ఉపాధి కోసం ఆశతో ఎదురుచూస్తున్నా, న్యాయం జరగలేదన్నారు. నిర్వాసితుల గోడును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అర్థం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నాలో నిర్వాసిత నాయకులు పితాని భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, దేముడు, వంశీకృష్ణ, జగన్, రమణ, రాజకీయ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి రవి, కోమటి శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, గవర వెంకటరమణ, ప్రియాంక, గాయత్రీదేవి, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, పరంధామయ్య పాల్గొన్నారు.

రాజకీయ ప్రసంగాలను అడ్డుకున్న నిర్వాసితులు....

ధర్నాకు సంఘీభావం తెలిపిన కొంతమంది నాయకులు రాజకీయ విమర్శలు చేయడంతో నిర్వాసితులు వద్దని అడ్డుకున్నారు. కేవలం నిర్వాసితుల గురించి మాట్లాడాలని, రాజకీయాలు వద్దని గట్టిగా కేకలు వేయటంతో వారు ప్రసంగాలు ఆపేశారు. నిర్వాసితులకు అండగా ఉంటామని, పోరాటాల్లో పాల్గొంటామని ప్రకటించారు.

నిర్వాసితులను నిర్లక్ష్యం చేయటం తగదు..మాజీ మంత్రి

ఉక్కు నిర్వాసితులను యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. నిర్వాసితులకు ఇంత అన్యాయం జరుగుతుందని నాడు అనుకోలేదని, మంచి జరుగుతుందని భావించామని వ్యాఖ్యానించారు. తన వయస్సు సహకరించినంత వరకు ఉక్కు నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఉద్యమిస్తానని పేర్కొన్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

నిర్వాసితుల ధర్నా నేపథ్యంలో సౌత్ ఏసీపీ వైశ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. సౌత్ పరిధిలోని అన్ని స్టేషన్ల నుంచి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

... 5వ పేజీ తరువాయి

కుట్టడం వల్ల సోకుతుంది. ఈ కీటకం కుట్టిన చోట నల్లని మచ్చలు, దద్దుర్లు ఏర్పడతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కీటకం కుట్టిన వారం లేదా రెండు వారాల తరువాత తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, విరేచనాలు, వాంతులు, ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు వేధిస్తుంటాయంటున్నారు. అయితే, చాలామందికి ఎటువంటి మచ్చలు లేకుండానే స్క్రబ్ టైఫస్ పాజిటివ్ వస్తోందని, ఇప్పటివరకూ జిల్లాలో 130కుపైగా కేసులు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. గడిచిన నాలుగు వారాల్లో 20కుపైగా కేసులు నమోదైనట్లు చెబుతున్నారు. అయితే, అనధికారికంగా ఈ సంఖ్య మూడు రెట్లకుపైగానే ఉంటుందంటున్నారు.

చికెన్‌పాక్స్ కేసులు

గడిచిన కొద్దిరోజుల నుంచి చికెన్ పాక్స్ (అమ్మవారు/ఆటలమ్మ) కేసులు నమోదవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గుతోపాటు శరీరంపై ఎర్రని దద్దుర్లుతో చిన్నారులు బాధపడుతుంటారని వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు కనిపించిన రెండు,మూడు రోజుల్లోనే శరీరమంతా దద్దుర్లు వ్యాప్తి చెందుతాయని వైద్యులు చెబుతున్నారు.

మరిన్ని కేసులు..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 1,89,838 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా 113 మందికి పాజిటివ్ వచ్చింది. అలాగే 7,763 మందికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా, 286 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అదేవిధంగా 267 మందికి చికున్‌గున్యా పరీక్షలు నిర్వహించగా 16 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

చల్లని గాలిలో తిరగవద్దు

- డాక్టర్ వై.జ్ఞాన సుందరరాజు, జనరల్ ఫిజీషియన్

ప్రస్తుతం ఫ్లూ జ్వరాలు అధికంగా ఉన్నాయి. కాబట్టి, చల్లనిగాలుల బారిన పడకుండా జాగ్రత్తపడాలి. ముఖ్యంగా చిన్నారులను సాయంత్రం వేళ బయటకు తీసుకువెళ్లకుండా ఉండాలి. అదే సమయంలో బయట ఆహారానికి దూరంగా ఉండడం మంచిది. స్క్రబ్ టైఫస్ కేసులు కూడా నమోదవుతున్నాయి. ఈ జ్వరాల పట్ల ఆందోళన అవసరం లేదు. అలాగని నిర్లక్ష్యం చేయకూడదు. కొన్నిసార్లు న్యుమోనియాకు దారితీస్తుంది. హార్ట్, లివర్, బ్రెయిన్‌పై తీవ్రమైన ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది. కాబట్టి, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల సలహా మేరకు పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి. అదే సమయంలో ఆందోళన కూడా పనికిరాదు. స్క్రబ్ టైఫస్ పాజిటివ్ వచ్చిన వారు సాధారణ మందులతో కోలుకోవచ్చు.

కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు

... 5వ పేజీ తరువాయి

అర్హతలు, నిబంధనలు కలిగిన కాంట్రాక్టర్లలో ఎవరు తక్కువకు కోట్ చేస్తే వారికి ప్రాజెక్టు నిర్వహణ అప్పగించాలి. అయితే భీమిలి సీసీఎస్ ప్రాజెక్టు విషయంలో అధికారులు దీనికి విరుద్ధంగా వ్యవహరించడం వివాదానికి తావిస్తోంది. నగరంలో నాలుగు జోన్లలో అమలవుతున్న సీసీఎస్ ప్రాజెక్టును భీమిలి జోన్‌లో కూడా అందుబాటులోకి తేవాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. దీనికోసం 15వ ఆర్థిక సంఘం నిధులతో భీమిలి జోన్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)లో సీసీఎస్ ప్రాజెక్టును ఏర్పాటుచేసిన సంస్థ గత ఏడాది అక్టోబరు 15 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయడంతో 15 రోజులు ట్రయల్ రన్ నిర్వహించి నవంబరు 1న జీవీఎంసీకి అప్పగించింది. అప్పటినుంచి మెకానికల్ విభాగం అధికారులు సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు టెండర్లు పిలిచి అర్హులను ఎంపికచేయాలి. కానీ గత ఏడాది నవంబరు ఒకటి నుంచి ఇప్పటివరకు సీసీఎస్ ప్రాజెక్టుకు టెండరు పిలవకుండా అస్మదీయులైన సంస్థకు నామినేషన్‌పై అప్పగిస్తూ వచ్చారు. సుమారు రూ.24 లక్షల విలువైన పనిని ఏడాదిపాటు నామినేషన్ పద్ధతిలో కొనసాగిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో మెకానికల్ విభాగం అధికారులు అప్రమత్తమై ఆగమేఘాల మీద భీమిలి సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు టెండరు తయారుచేసి, స్టాండింగ్ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించారు.

మేయర్ ప్రశ్నల వర్షం

దీనిపై చర్చ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావుతో పాటు కొందరు సభ్యులు ఏడాదిగా సీసీఎస్ ప్రాజెక్టును ఎవరు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. దీనికి ఎస్ఈ గోవిందరావు సమాధానం ఇస్తూ ఇకపై నిర్వహణకు టెండర్లు పిలుస్తున్నామని, గతంలో జరిగిన దానికి కాదని సమాధానం ఇవ్వడంతో మేయర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏడాదికి సుమారు రూ.24 లక్షలు ఖర్చవుతోందని ప్రతిపాదన పెట్టగా...ఏడాదిగా ఎవరు నిర్వహించారు? టెండరు పిలిచారా? అని తిరిగి ప్రశ్నించేసరికి స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో ఆ ప్రాజెక్టును స్వయంగా పరిశీలిస్తామని, ఏడాదిలో ఎంత బిల్లులు చెల్లించారో వివరాలు అందజేయాలని స్పష్టంచేశారు.సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు టెండరు పిలవకుండా నామినేషన్‌పై అప్పగించడంలో మతలబు ఏమిటనే దానిపై స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ఇతర అధికారులతోపాటు సభ్యులు సైతం చర్చించుకుంటున్నారు.

ప్రధాన రహదారి విస్తరణ చేపట్టరూ!

- దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితం
- నిత్యం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

గోపాలపట్నం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వేలాది మంది నిత్యం రాకపోకలు సాగించే 14 గ్రామాలకు ప్రధాన ప్రధాన రహదారి ఇది. గోపాలపట్నం నుంచి సబ్బవరం, దువ్వాడ వెళ్లే బైపాస్ రహదారి కూడా ఇదే. ఇంత ప్రాముఖ్యం ఉన్న ఈ రహదారి విస్తరణకు ప్రతిపాదనలు చేసి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ అవి జరగకపోవడంతో ఈ మార్గంలో సాగించే వేలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


వాహన రాకపోకలతో రద్దీగా ఉన్న కొత్తపాలెం కూడలి

నిత్యం ఇబ్బందులే..

గోపాలపట్నం నుంచి కొత్తపాలెం, నరవ గ్రామాల మీదుగా సబ్బవరం, దువ్వాడ రైల్వే స్టేషన్‌లకు వెళ్లడానికి ఈ రహదారి ఎంతో కీలకమైనది. ఈ రహదారి నుంచి నిత్యం వేల సంఖ్యలో జనాలు రాకపోకలు సాగిస్తుంటారు. దువ్వాడ, నరవ గ్రామాల్లో పలు విద్యా సంస్థలు నెలకొనడంతో పాటు ఇదే మార్గంలో సెజ్ ఉండడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ మార్గంలో ఉన్న కొత్తపాలెం గ్రామ కూడలి ఎంతో కీలకమైనది. గ్రామంలో రహదారికి ఇరువైపులా దుకాణాలు, జనవాసాలు ఉండడంతో రహదారిపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో కొత్తపాలెం కూడలిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడి, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

విస్తరణ చేస్తేనే సమస్యకు పరిష్కారం..

కొత్తపాలెం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్ వరకూ 80 అడుగుల రహదారి నిర్మించాలనేది వీఎంఆర్‌డీఏ ప్రతిపాదనలో ఉంది. కాలం గడుస్తున్నా ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. కొత్తపాలెం గ్రామంలో సుమారు కిలోమీటరు పొడవునా రహదారికి ఇరువైపులా ఆక్రమణలే ఉన్నాయి. దీంతో రహదారి మరింత ఇరుకైపోయింది. కనీసం గ్రామంలోని రహదారినైనా 60 అడుగులు విస్తరిస్తే చాలా వరకు ఇబ్బంది తీరుతుంది. 2009వ సంవత్సరంలో గ్రామంలో రహదారి విస్తరణ చేపట్టినా ఆక్రమణల కారణంగా రహదారి ఇరుకైపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు దృష్టి సారించి కొత్తపాలెం గ్రామంలో రహదారి విస్తరణ చేపట్టే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు 5 వినతులు

వేపగుంట డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 5 అర్జీలు అందాయి. వీటిలో ముఖ్యంగా 96వ వార్డు సర్వే నంబరు 179/2 చినముషిడివాడలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని, శారదానగర్‌లో యూజీడీ పైప్ లైన్ సమస్య పరిష్కరించాలని, 97వ వార్డు నేతాజీనగర్‌లో అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, సుజాతనగర్ సీ1 జోన్ పార్కు వద్ద రహదారులు నిర్మించాలని తదితర వినతులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధిపతులకు పంపిస్తామని జడ్సీ హెచ్ శంకరరావు తెలియజేశారు.

వైభవంగా పోలమాంబ ఉత్సవం


అన్న సమారాధన చేస్తున్న శరగడం

పెందుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ద్రోణంరాజు నగర్‌లో ఉన్న పోలమాంబ ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంటరీ వైసీపీ పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

గాజువాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నతంగా ఎదిగినప్పుడే దాతలు అందించిన సహకారానికి విలువ ఉంటుందని రైల్వే కన్సల్టేటివ్ కమిటీ మాజీ డైరెక్టర్ కొలిపాక అప్పారావు అన్నారు. ఇస్లాంపేట హైస్కూల్‌కు అప్పారావు, అగనంపూడి ప్రాంతానికి చెందిన నెల్లి శ్రీనివాసరావు కుర్చీలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌క్లూజన్ పద్ధతులపై అవగాహన

అనంపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు సోమవారం 'ఫ్యూచర్ ఆఫ్ ఇన్‌క్లూజన్ అండ్ హై పెర్ఫార్మింగ్ వర్క్ ప్లేస్' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాండిక్స్ ఇండియా ప్రతినిధి షహజాదీ షేక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డైవర్సిటీ ఈక్విటీ, ఇన్‌క్లూజన్ పద్ధతులు, వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగులు పనితీరు నిబద్ధతను పెంపొందించడంలో డైవర్సిటీ ఎక్విటీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు షహజాదీ షేక్‌ను సత్కరించారు.

సినిమా గైడ్

- ఆంధ్రా కింగ్ తాలూకా : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).
- ప్రేమంటే : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- 12ఎ రైల్వే కాలని : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- కాంత :
- రాజా వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు : జగదాంబ
- శిసు / రాజు వెడ్స్ రాంబాయి : శారదా
- పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ : రమాదేవి
- ది గర్ల ఫ్రెండ్ :శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 37, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, గుత్తి/రవి వంకాయలు 34, బెండకాయలు 58, పచ్చిమిర్చి 42, బజ్జి పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 32, బంగాళదుంపలు 18, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 64, బరబాటి 42, పొటల్స్ 54, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 40, బద్ద చిక్కుడు 44, దోస కాయలు 22, పొటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 60, కీర దోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద 50, దేముడుచిక్కుడు 54, గ్రీన్‌పీస్ బటాని 100, గోరు చిక్కుడు 48, కూరపెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిదగుమ్మడి కాయ 20, కర్రపెండలం 32, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ఆటో సుందర్‌కు గవర్నర్ అభినందన


ఆటో సుందర్‌ను అభినందిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

గోపాలపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోత): రెండు దశాబ్దాలుగా గర్భిణులకు ఉచిత ఆటో ప్రయాణం కల్పిస్తున్న గోపాలపట్నం వాసి ఉల్లూరి సుందర్ (ఆటో సుందర్)ను ఢిల్లీలోని ఆది లీలా ఫౌండేషన్ ఇటీవల భారతీయ సేవా అవార్డుతో సత్కరించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధి ఆది నారాయణ, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పాహుజ సమక్షంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆటో సుందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సుందర్ సేవలను కొనియాడిన గవర్నర్ ఆయనను అభినందించారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా షాలిమార్-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 07148 నంబరు గల రైలు ఈ నెల 8న చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ, రాత్రి 11.50 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07149 నంబరు గల రైలు ఈ నెల 10న మధ్యాహ్నం 12.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 2.40 గంటలకు దువ్వాడ, అదేరోజు (గురువారం) సాయంత్రం 4 గంటలకు చర్లపల్లి చేరుతుంది. 07182 నంబరు గల రైలు ఈ నెల 9న మధ్యాహ్నం 12.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 2.40 గంటలకు దువ్వాడ, అదేరోజు సాయంత్రం 4.00 గంటలకు చర్లపల్లి చేరుతుంది.

మేరీమాత ఉత్సవంలో తప్పిపోయిన చిన్నారులు

గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండగుడి మేరీమాత ఉత్సవం సందర్భంగా భారీగా జనం తరలిరావడంతో రోజ్ హిల్స్ కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు తప్పిపోవడంతో వారి తల్లిదండ్రులు కొండపై ఏర్పాటుచేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదుచేయగా, తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కోసం హార్బర్ సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది గాలించి వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. జాన్వి అనే ఐదేళ్ల బాలికతోపాటు సుశాంత్ అనే ఐదేళ్ల బాలుడు జనాల్లో తప్పిపోగా, వారిని సీఐ సింహాద్రినాయుడు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. కొండపైకి లక్షలాదిమంది తరలిరావడంతో రోజ్ హిల్స్‌పై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరించి రోడ్డుపైన ఆటబొమ్మలు, ఇతర వస్తువులు విక్రయించేవారిని కొండపైన ఖాళీ ప్రదేశానికి తరలించడంతో తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా అడ్డుకున్నట్టయింది.


బాలుడు సుశాంత్‌ను తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ విశాఖకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని ప్రెసిడెంట్ వై.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత నవంబరు 21న ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా షెడ్యూల్ విడుదల చేశారని, అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. తాజాగా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ విశాఖపట్నం ఎన్నికల అధికారి నూతన షెడ్యూల్‌ను ప్రకటించారని తెలిపారు. దీని ప్రకారం ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. 18న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విశాఖలో పని చేస్తున్న ఏపీ ఎన్‌జీవో సభ్యులు పైన తెలిపిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.

విస్తరణకు నోచుకోని పెందుర్తి రైతుబజార్

- సరిపడా స్టాల్స్ లేకపోవడంతో నేలపైనే పోసి కూరగాయల విక్రయం
- స్థలం లేకపోవడంతో దుకాణాలకు సమీపంలోనే వాహనాల పార్కింగ్

పెందుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెందుర్తి రైతుబజార్ అవసరాలకు అనుగుణంగా విస్తరించకపోవడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైతుబజార్‌ను రోజుకు వందల సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. 90 స్టాళ్ల, 250 క్వింటాళ్ల కూరగాయల విక్రయాలు జరుగుతుంటాయి. 51 గ్రామాల నుంచి రైతులు ఈ బజార్‌లో ఉన్న స్టాళ్లలో విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రైతుబజార్ అవసరాలకు తగ్గట్టు విస్తరణ జరగకపోవడం గమనార్హం. రోజురోజుకు విక్రయదారులు, కొనుగోలుదారులు పెరగడంతో రైతుబజార్ ఇరుకవుతోంది. రైతులకు సరిపడా స్టాల్స్ లేవు. దీంతో నేల మీదే కూరగాయలను పోసి విక్రయిస్తున్నారు. తమ స్టాల్స్ వద్దకు కూరగాయలను ఆటోలో తెచ్చుకునే క్రమంలో వాటి వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కోసారి కొనుగోలు దారులకు ఈ వాహనాలు అడ్డంకిగా మారుతున్నాయి. రైతుబజార్‌లో కోల్డ్ స్టోరేజ్ లేకపోవడంతో కొన్ని రకాల కూరగాయలు నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. ఆయాకూరగాయ లు కుళ్లిపోవడంతో నష్టపోతున్నామని పలువు రు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతుబజార్‌కు వచ్చే కొనుగోలు దారులు వారి వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కనే పార్కింగ్ చేసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. గిరిజన ప్రాంతం నుంచి వచ్చే రైతులకు ఇక్కడ వసతి సౌకర్యం సమస్యగా మారుతోంది. దీంతో సేంద్రియ వస్తువులు లభ్యం కావడంలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.


పెందుర్తి రైతుబజార్

నూతన రైతుబజార్ మాటేంటి?

పెందుర్తిలో గల రైతు బజార్ విస్తరణ జరగకపోవడంతో సుజాతనగర్‌లో నూతన రైతుబజార్ ఏర్పాటు చేయాలని ఎనిమిదేళ్ల క్రితం ప్రతిపాదన చేశారు. రూ.1 కోటితో ఈ బజార్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. రైతుబజార్‌కు కేటాయించిన స్థలానికి సమీపంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్న వ్యాపారి, ఆ స్థలంలో నిర్మాణ సామగ్రి నిల్వ చేసే స్టాక్ పాయింట్‌గా ఏర్పాటు చేయడాన్ని అధికారులు గుర్తించారు. అప్పటి ఆర్డీవో తేజ్‌భరత్ ఈ స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడి స్థలంలో నిర్మాణ సామగ్రి ఉన్నట్టు తేల్చారు. దీంతో ఇది వివాదాస్పదంగా మారడంతో రైతు బజార్ ఏర్పాటు ఆదిలోనే నిలిచిపోయింది. ఇప్పుడు ఆ స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతుబజార్‌కు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

గోతులమయంగా రహదారి


సీతారామరాజు నగర్ మ్యాన్‌హోల్ వద్ద గుంతలు పడిన రోడ్డు

ఎన్.ఎ.డి.జంక్షన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఎస్‌టీఎల్ దగ్గర సీతారామరాజు నగర్ రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. ఇక్కడ ఉన్న యూజీడీ పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో మ్యాన్‌హోల్ చుట్టు మరో రెండు గుంతలు పడ్డాయి. అది కూడా రోడ్డు మధ్యలో ఉండడంతో ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంకుడు గుంతల తవ్వకం


87వ వార్డులో ఇంకుడు గుంతలు తవ్వుతున్న దృశ్యం

కూర్మన్నపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతలు ఎంతగానో దోహదపడతాయని 87వ వార్డు తిరుమల నగర్ కార్యదర్శి జి.విశ్వేశ్వరరావు అన్నారు. కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాలనీలో ఇంకుడు గుంతలు తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు తాగునీటి సమస్య రాకుండా ఉండాలంటే ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత తవ్వించుకోవాలనే నిబంధన కాలనీలో అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

పెందుర్తి రూరల్ డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికట్టడం సామాజిక బాధ్యత అని సమగ్ర బాలల పరిరక్షణ పథకం సిబ్బంది పేర్కొన్నారు. చింతల అగ్రహారం జడ్పీ పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. 'బాల్య వివాహ ముక్త భారత్' వంద రోజుల ప్రణాళిక గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకురాలు ఐ.సురేఖ, హెచ్ఎం కమల కుమారి పాల్గొన్నారు.


పెందుర్తి: బాల్య వివాహాలు నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అగనంపూడిలో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాల్య వివాహ ముక్త భారత్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పెందుర్తి క్లస్టర్ సీడీపీవో నీలవేణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. సమాజంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు చేయడం వల్ల భవిష్యత్తులో కలిగే అనర్థాల గురించి వివరించారు. బాల్య వివాహాలు జరిగితే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మురుగు పోయేందుకు మార్గం సుగమం

అగనంపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు ఉక్కు నిర్వాసిత కాలనీ డొంకాడలో ఎప్పటి నుంచో తిష్ట వేసిన డ్రైనేజీ సమస్యకు అధికారులకు ఎట్టకేలకు పరిష్కారం చూపారు. ఈ ప్రాంతంలో కాలువ నిర్మాణానికి పనులు చేపడుతున్నారు. ఇంతకముందు ఈ ప్రాంతంలో మురుగు పోయేందుకు దారి లేకపోవడంతో ప్రధాన రహదారి, వీధి రోడ్లపై నిలిచిపోయేది. దీనిపై స్పందించిన అధికారులు రూ.49.6 లక్షల నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. గ్రామాల నుంచి ప్రధాన గెడ్డ వరకు డ్రైనేజీ పనులు చేపట్టారు. పనులు పూర్తవడంతో ఈ ప్రాంతంలో మురుగు సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


డొంకాడ వద్ద నిర్మిస్తున్న డ్రైనేజీ


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

12న గాజువాకలో మెగా జాబ్‌మేళా

గాజువాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన జరగనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను గాజువాక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం శ్రీనగర్‌లోని టీఎస్సార్, టీబీకే కళాశాలలో జాబ్ మేళా జరగనున్నదని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు దేవేంద్ర, గంగరాజు పాల్గొన్నారు.

చింతకుంట రత్నమ్మకు ఎమ్మెల్యే పంచకర్ల నివాళి


చింతకుంట రత్నమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, చిత్రంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

పెందుర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తి దివంగత చింతకుంట రత్నమ్మకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం నివాళులు అర్పించారు. కడప జిల్లా ఎర్రగుంట మండలం పొట్లదుర్తిలో జరిగిన పెద్ద కర్మకు పంచకర్ల హాజరై రత్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఎంపీ సీఎం రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్రీడలతో ఉల్లాసం


బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ క్రీడా సెంటర్‌లో వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్లు వీవీ.కృష్ణారావు, భావినేని సురేశ్

కూర్మన్నపాలెం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉల్లాసం, ఉత్సాహం, ఆరోగ్యం లభిస్తుందని వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్లు వీవీ కృష్ణారావు, భావినేని సురేశ్ అన్నారు. 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్, లక్ష్య బాడ్మింటన్ అకాడమీలో ఇటీవల ప్రారంభించిన బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ క్రీడా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులను, ఆశయాలను ప్రోత్సహించాలని, జీవితంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించేందుకు తగిన స్ఫూర్తిని అందించాలన్నారు. ఆస్ఫూర్తి క్రీడలతోనే సాధ్యమన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేస్తున్న లక్ష్య బ్యాడ్మింటన్ కోచ్ మురళీ కృష్ణను అభినందించారు. భావినేని సురేశ్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, సంకల్పం పిల్లల్లో రూపుదిద్దుకునేలా చేయాల్సిన బాధ్యత కోచ్‌లతో పాటు, తల్లిదండ్రులు కూడా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా టీమ్ కోచ్ మురళీ కృష్ణ, ఆళ్ల నాగ నవీన్ కుమార్, వైజాగ్ ప్రొఫైల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాపులు ఐకమత్యంగా ఉండాలి

- బీజేపీ గాజువాక సమన్వయకర్త కరణంరెడ్డి నరసింగరావు


కాపుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కరణంరెడ్డి నరసింగరావు

ఆటోనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాపులు ఐకమత్యంగా ఉన్ననాడే సమస్యలు పరిష్కారమవుతాయని గాజువాక బీజేపీ సమన్వయకర్త కరణం రెడ్డి నరసింగరావు అన్నారు. 70వ వార్డు ఎల్‌వీ.నగర్‌లో నిర్వహించిన తిరుమల దేవ రాయ కాపు, తెలగ, బలిజ, సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాపుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపులందరూ కష్ట సుఖాల్లో ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. విద్య, వైద్య, సామాజిక, రాజకీయ రంగాల్లో కాపులు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. చింతపల్లి సతీశ్ మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తుంపాల చిరంజీవి, సిరసపల్లి నరసింగరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు

అగనంపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డులోని శ్రీనివాసనగర్, అనగంపూడి శశ్మాన వాటిక, షిర్డీసాయినగర్, జనచైతన్యనగర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దశల వారీగా వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎక్కడైనా వీధి లైట్లు లేకపోతే తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

86వ వార్డులో బస్ షెల్టర్ లేక ఇబ్బందులు


బస్ షెల్టర్‌లేక డివైడర్‌పై వేచి ఉన్న ప్రయాణికులు

కూర్మన్నపాలెం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86 వార్డు ఉడా నగర్ జంక్షన్‌లో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. ఉక్కు ఉద్యోగులు, రైల్వే ప్రయాణికులు, విద్యార్థులు, పాదచారులతో నిత్యం రద్దీగా ఉండే ఉడా ఫేజ్ 1, వడ్లపూడి, ముస్తఫా జంక్షన్, సైమన్ నరగ్‌లలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయలేదు. పలు విద్యా సంస్థలు, భారీ పరిశ్రమలకు కేంద్ర స్థానమైన కూర్మన్నపాలెం గడిచిన రెండు దశాబ్దాలతో శరవేగంగా అభివృద్ధి చెందింది. అయితే పెరిగిన జనభాకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు కాలేదు. ఈ జంక్షన్లకు శివారు ప్రాంతం నుంచి రైతులు, కూలీలు, ప్రయాణికులు అధిక సంఖ్యలో చేరుకుంటారు. జనంతో కిటకిటలాడే ఈ జంక్షన్‌లో బస్ షెల్టర్ లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ప్రయాణి చేయడానికి ఎక్కువగా ఇబ్బందులు పడతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో బస్ షెల్టర్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా మేరీమాత ఉత్సవం

మహారాణిపేట/జ్ఞానాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దారి పొడుగునా జనం.. ఎటుచూసినా సందడి.. పాత పోస్టాఫీసు సమీపంలోని అన్ని రహదారులు కిటకిటలాడాయి. రోజ్‌హిల్ అమలోద్భవిమాత (కొండగుడి మేరీమాత) ఉత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్వాసకులు ఉత్సవానికి తరలి వచ్చి రోజ్‌హిల్‌పై మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. నవంబరు 29న ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం వార్షిక మహోత్సవంతో ముగిశాయి. సోమవారం వేకువన 4 గంటల నుంచి ఆరాధనలు ప్రారంభించారు. ప్రార్థన మందిరంలో ఆంగ్లం, తెలుగులో దివ్యబలిపూజ నిర్వహించారు. 7.30 గంటలకు గుహ వద్ద విశాఖ అగ్ర పీఠాధిపతి ఉడుముల బాల ఆధ్వర్యంలో తెలుగులో దివ్యపూజ నిర్వహించారు. జపమాల, స్వస్థత ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. గుహ వద్ద చర్చి ఫాదర్ల సమక్షంలో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 6 గంటలకు తెలుగులో దివ్య బలి పూజ జరిపించారు. ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన తేరు ప్రదక్షిణ మధ్యాహ్నం 1.30 గంటలకు కొండ దిగువన ఉన్న సెయింట్ అలోసిస్ చర్చి నుంచి మేరీ మాత విగ్రహం (తేరు ప్రదక్షిణ) కొండ మీదకు ఊరేగింపుగా తీసుకొని వెళ్లారు. ఆదివారం రాత్రి నుంచే ఉత్సవాల కోసం వచ్చే భక్తులతో వీధులన్నీ కిక్కిరిశాయి. సమీప ప్రాంతాల్లోని పాఠశాలల్లో వారికి వసతి ఏర్పాట్లు చేశారు. విశ్వాసకుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. కొండ దిగువన ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్తరోడ్డు, చిలకలకూడలి వరకు మాత్రమే ఆటోలను అనుమతించారు. విశ్వాసకులు కాలినడకన కొండకు చేరేందుకు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. ప్రార్థన మందిరంలో స్టెల్లా మారిస్ విచారణకర్త రెవరెండ్ ఫాదర్ కె.విజయశేఖర్ ఉత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విశాఖపురి మేరీమాత ద్వైమాస పత్రిక బైబిల్ క్విజ్, బైబిల్ పదకేళీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ కొండాల జోసెఫ్, ఫాదర్ తోమాస్ పుల్లాట్, ఫాదర్ ఎం.విజయ్‌రాజు, ఫాదర్ ఎం.లారెన్సు, బ్రదర్ సెబాస్టియన్, బ్రదర్ పవన్ ఉత్సవ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.


పూల అలంకరణలో మేరీమాత రథం


దర్శనానికి వెళ్తున్న భక్తులు


పాతపోస్టాఫీసు ప్రాంతం నుంచి కొండగుడికి వెళ్లే మార్గంలో జనసందోహం


సంప్రదాయబద్ధంగా మేరీమాత వద్దకు వెళ్తున్న ప్రముఖులు

లంచం కేసులో రైల్వే ఉద్యోగికి జైలు, జరిమానా

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బిల్లులు చెల్లించేందుకు కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన రైల్వే ఉద్యోగికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ కార్యాలయంలో చల్లా శ్రీనివాసరావు అకౌంట్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలో బెంగళూరుకు చెందిన గ్లోబల్ ఏజెన్సీ సంస్థ 2017లో కొన్ని పనులు చేపట్టి బిల్లు కోసం దరఖాస్తు చేసుకుంది. 2017 జూలై, సెప్టెంబరు నెలలకు సంబంధించిన పనులకు రూ.30 లక్షలు బిల్లు చెల్లించాలంటే తనకు రూ.15 వేలు లంచం ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అదే ఏడాది మార్చి నుంచి జూలై వరకూ చేసిన పనులకు బిల్లు ఇచ్చినప్పుడు శ్రీనివాసరావుకు లంచం ఇచ్చిన సంస్థ ప్రతినిధులు...మరోసారి ఇవ్వడం ఇష్టం లేక సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా శ్రీనివాసరావును పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆధారాలను పరిశీలించిన కోర్టు శ్రీనివాసరావుకు జైలు శిక్ష, జరిమానా విధించింది.

సమస్య పరిష్కారం కాకుంటే కారణం చెప్పండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 292 అర్జీలు

మహారాణిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసిన అర్జీలు పరిష్కారం కాకపోతే అందుకు కారణాలను ఫోన్‌లో వారికి వివరించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 292 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు 108, జీవీఎంసీ 83, పోలీసు 18, ఇతర శాఖలకు సంబంధించి 83 అర్జీలు వచ్చాయి. అనంతరం గత వారం జరిగిన పీజీఆర్ఎస్ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి పెండింగ్ సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలని, పదేపదే అర్జీలు పునరావృతమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్ 115 ఫిర్యాదులు

విశాఖపట్నం:పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 115 ఫిర్యాదులు అందాయి. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సీపీ శంఖబ్రత బాగ్చి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు. అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలు, కుటుంబ కలహాలు, మోసం, భార్యాభర్తల వివాదాలకు సంబంధించిన అంశాలే ఉన్నాయి.

11 నుంచి ఆటో డ్రైవర్ల రిలే నిరాహార దీక్ష

మహిళల ఉచిత బస్సు పథకానికి వ్యతిరేకంగా ఈ నెల 11 నుంచి రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు ఆటో డ్రైవర్ల సంఘం ప్రకటించింది. సోమవారం సంఘం ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకుడు చింతకాయల శ్రీను మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, విద్యార్థులు, ఉద్యోగులు బస్సులలో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.


మహిళ సమస్యను వింటున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, అర్జీలు స్వీకరిస్తున్న జేసీ మయూర్ అశోక్ తదితరులు

బకాయిల కోసం గంగవరం పోర్టు ముట్టడి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు దగ్గరకు చేరిన 'పంచాయితీ'
- పరిష్కారానికి పోర్టు యాజమాన్యం హామీ

పెదగంట్యాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వన్‌టైం సెటిల్ మెంట్‌లో బకాయిల మొత్తం వెంటనే కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేస్తూ అదానీ గంగవరం పోర్టు నిర్వాసితులు సోమవారం పోర్టు ప్రధాన గేటును ముట్టడించారు. గంగవరం పోర్టు యాజమాన్యం, నిర్వాసిత ఉద్యోగుల సంఘం, కలెక్టర్, కార్మిక కమిషనర్‌ల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం 500 మంది కార్మికులకు రూ.27లక్షల వంతున చెల్లించి వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోవాల్సి ఉంది. అయితే పోర్టు యాజమాన్యం ఒక్కో కార్మికునికి రూ. 24.7 లక్షలు చెల్లించింది. మిగిలిన మొత్తాన్ని తరువాత ఇస్తామని ప్రకటించింది. ఇది జరిగి ఏడాదిన్నర అయినా ఇంతవరకు చెల్లింపులు జరగకపోవడంతో పోర్టు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పోర్టు నిర్వాసితుల అసోసియేషన్ పిలుపు మేరకు సుమారు 500 మంది కార్మికులు స్టీల్ ప్లాంట్ జనరల్ హాస్పిటల్ వద్దకు చేరుకుని ప్రదర్శనగా గంగవరం పోర్టు ప్రధాన గేటువరకు వెళ్లి ముట్టడించారు. ఆందోళనకారులను గేటువరకు రానీయకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనితో పోలీసులకు, నిర్వాసితులకు మధ్య వాగ్వివాదం జరిగింది. పరిస్థితి తీవ్రతను గుర్తించి పోలీసు అదనపు బలగాలు అక్కడకు చేరుకున్నాయి.


పోర్టు గేటు వద్ద నిర్వాసితులు

పోర్టు కార్యాలయంలో చర్చలు

గంగవరం పోర్టు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో యాజమాన్యం, అసోసియేషన్ ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. వారు పదిమంది, యాజమాన్య ప్రతినిధులు నలుగురు చర్చలు జరిపారు. తమకు బకాయిలు వెంటనే చెల్లించాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేయగా, ఆదాయ పన్ను చెల్లింపులు పోను మిగిలిన మొత్తాలను చెల్లిస్తామని యాజమాన్య ప్రతినిధులు పేర్కొన్నారు. అగ్రిమెంటులో ఆదాయ పన్ను ప్రస్తావన లేనందున తమకు దానితో సంబంధం లేదని అసోసియేషన్ ప్రతినిధులు తెగేసి చెప్పారు.

ఎమ్మెల్యే దగ్గర 'పంచాయితీ'

పోర్టు యాజమాన్యానికి, నిర్వాసితుల అసోసియేషన్ ప్రతినిధులకు మధ్య చర్చలు కొలిక్కి రాకపోవడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమక్షంలో తేల్చుకుందామని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి దోవిందరాజు పేర్కొనడంతో టీడీపీ కార్యాలయానికి ఈ 'పంచాయితీ' మారింది. ఇరువైపులా సమాచారం విన్న ఎమ్మెల్యే వన్‌టైం సెటిల్‌మెంట్ ఒప్పందం ప్రకారం నిర్వాసితులకు బకాయిలు చెల్లించాల్సిందేనని పోర్టు యాజమాన్య ప్రతినిధులకు సూచించారు. పోర్టు సీఈఓ దీనికి సమాధానం ఇస్తూ ప్రధాన కార్యాలయంతో సంప్రదింపులు జరిపి రెండు వారాల్లో సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు.

పెందుర్తిలో ఇద్దరు టీడీపీ నేతల సస్పెన్షన్


పెందుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలంలో ఇద్దరు టీడీపీ నేతలపై పార్టీ అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేసింది. మండలంలోని చింతగట్లకు చెందిన గనిశెట్టి కనకరాజు, దమ్ము రమేశ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేశామని అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గనిశెట్టి కనకరాజు టీడీపీ నియోజకవర్గ(పెందుర్తి) ఇన్‌చార్జి గండి బాబ్జీ ముఖ్య అనుచరుడు. ఇటీవల జరిగిన సంస్థాగత కమిటీల నియామకాల్లో పెందుర్తి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గత ఏడాది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.

డేటా సెంటర్లు కాదు...ఉపాధి కల్పించే పరిశ్రమలు కావాలి

స్టీల్‌ప్లాంట్ ప్రతిష్ఠ దిగజార్చి ప్రైవేటుకి అప్పగించేందుకు కుట్ర సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డేటా సెంటర్లు ఎన్ని వచ్చినా పెద్దగా ఉపాధి అవకాశాలు ఉండవు కాబట్టి, ఎక్కువమందికి ఉద్యోగాలు కల్పించే టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫుట్‌వేర్, గార్మెంట్ వంటి పరిశ్రమలను విశాఖకు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సూచించారు. ఈ నెల 31 నుంచి జరగబోయే సీఐటీయూ అఖిల భారత మహాసభల ఏర్పాట్లను పరిశీలించేందుకు విశాఖ వచ్చిన ఆయన సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలో వచ్చిన టీడీపీ, తర్వాత వైసీపీ, నేడు కూటమి ప్రభుత్వం కూడా సదస్సులు పెట్టి రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నాయే తప్ప, విదేశీ పెట్టుబడులు మాత్రం రావడం లేదన్నారు. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే గత రెండేళ్లలో విదేశీ కంపెనీలు వెనక్కి వెళ్లిపోయాయే తప్ప, కొత్తగా ఏమీ రాలేదని తెలుస్తోందన్నారు. కబుర్లు చెప్పడం కంటే పెట్టుబడులు రాబట్టడానికి నిర్దిష్ట ప్రణాళిక తయారుచేయడంపై దృష్టిపెట్టాలని రాఘవులు సూచించారు.

స్టీల్‌ప్లాంటు ప్రతిష్ఠను దిగజార్చడం ద్వారా ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని రాఘవులు ఆరోపించారు. నాసిరకం ముడిపదార్థాలను సరఫరా చేసి నాణ్యత తగ్గిపోయిందంటూ ఉక్కు ఉత్పత్తిని కించపరుస్తున్నారన్నారు. రూ.400 కోట్ల మేర జీతాలు బకాయి పెట్టడం ద్వారా బయటకు వెళ్లిపోవడమే మంచిదనే భావన ఉద్యోగుల్లో కల్పిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంటు నిర్వాసితుల్లో ఇంకా ఎనిమిదివేల మందికి ఉపాధి కల్పించలేదన్నారు. సేకరించిన భూముల్లో చాలావరకు ఉపయోగించనివి ఉన్నందున వారికి ఉపాధి కల్పించడమో...లేదంటే వారి భూములను వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కీలక రంగాల్లో ప్రభుత్వ నియంత్రణ ఉండాల్సిందేనని, లేనిపక్షంలో ఏం జరుగుతుందనే దానికి ఇండిగో సంక్షోభమే ఉదాహరణ అన్నారు. ఇండిగో సంక్షోభానికి పాలకవర్గం విధానాలే కారణమన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బీవీ రాఘవులు. చిత్రంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఉన్నారు

క్రైం... crime news

భీమిలి బీచ్‌రోడ్డులో కారు బీభత్సం


ప్రమాదానికి కారణమైన కారు


ఎర్ర కారును ఢీకొనడంతో నుజ్జయిన గ్రే కలర్ కారు


గాయపడిన మహిళ

- అతివేగంతో వచ్చి డివైడర్‌పైకి..
- అదుపుచేసే యత్నంలో మరో కారుతో ఢీ
- ఆటోనూ ఢీకొట్టి పల్టీ
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ప్రమాద కారకులు ఇంజనీరింగ్ విద్యార్థులు
- కారులో ఓ విద్యార్థిని కూడా.. అందరూ మైనర్లే?

భీమునిపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌రోడ్డులో అతివేగంగా దూసుకువచ్చిన క్రెట్టా కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో మరో కారు, ఆటో నుజ్జయ్యాయి. ఆటోలో ఉన్న ఓ మహిళ తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. సోమవారం మధ్యాహ్నం సుమారు 3.10 గంటల సమయంలో రెడ్ కలర్ క్రెట్టాకారులో రుషికొండ గీతం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు భీమిలివైపు దూసుకువచ్చారు. మార్గంమధ్యలో ఎర్రమట్టిదిబ్బలు చేరేసరికి వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. కారును మళ్లీ ఎడమవైపు తిప్పడంతో ముందు వెళుతున్న గ్రే కలర్ వేగనార్ కారును బలంగా ఢీకొనడంతో బోల్తాపడి పల్టీలు కొట్టింది. ఆ కారును నడుపుతున్న వ్యక్తి తలకు తీవ్రగాయమైంది. గ్రేకలర్ కారు వెళ్లి రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న అంజలికుమారి అనే మహిళ తలకు తీవ్ర గాయమైంది. ప్రమాదానికి కారణమైన కారులో ముగ్గురు విద్యార్థులు, ఒక విద్యార్థిని ఉన్నట్లు తెలిసింది. వారిలో ఏ ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ లేదు. అందరూ మైనర్లే కావడం గమనార్హం. సమాచారం అందిన వెంటనే భీమిలి పోలీసు కానిస్టేబుల్ నాగరాజు, బీచ్ మొబైల్ పోలీసు వెహికల్ కానిస్టేబుల్ కనకారావు సంఘటనా స్థలికి చేరి రహదారిపై పడి ఉన్న కార్లను స్థానిక యువకుల సహాయంతో పక్కకు తొలగించారు. ప్రమాదానికి కారకులైన విద్యార్థులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న మరో విద్యార్థిని అదృశ్యమైనట్లు తెలిసింది. పోలీసులు ప్రశ్నించినా ఆ విద్యార్థిని పేరు వారు చెప్పలేదు. గీతంలో ఇంజనీరింగ్ చదువుతున్న ఈ విద్యార్థులు భీమిలి బీచ్‌ను చూసేందుకు కారులో వస్తున్నారు. కారును అతివేగంగా నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పైకి వెళ్లిన సమయంలో, మరో విద్యార్థి స్టీరింగ్‌ను ఎడమ వైపు తిప్పాడు. దీంతో రహదారిలో వెళుతున్న వేగనార్ కారును ఢీకొట్టింది. నేరెళ్లవలసకు చెందిన అప్పలరాజుకు చెందిన ఆటోను ఢీకొట్టడంతో లోపల ఉన్న అతని భార్య తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంపై భీమిలి సీఐ తిరుమలరావుతో మాట్లాడగా ఇప్పటివరకూ పూర్తి వివరాలు తెలియలేదని, ఫిర్యాదు కూడా అందలేదన్నారు. కారును నడిపిన విద్యార్థి మైనర్ అని అంటున్నారు. అదుపులో ఉన్నారన్నారు. ప్రమాదానికి కారణమైన కారులో విద్యార్థులు ఎందరున్నారనే విషయం స్పష్టంగా తెలియలేదన్నారు.

సైబర్ నేరగాళ్లకు కరెంట్ అకౌంట్లు సమకూర్చిన ఆరుగురి అరెస్ట్

ఎండాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొందరు టెలిగ్రామ్ ఛానల్ ద్వారా ముఠాగా ఏర్పడి పలువురి నుంచి కరెంట్ అకౌంట్లను సమీకరించి సైబర్ నేరగాళ్లకు సరఫరా చేస్తున్న అనకాపల్లి, గుంటూరు, కాకినాడ, వెస్ట్‌గోదావరి, బాపట్ల జిల్లాలకు చెందిన ఆరుగురిని అనకాపల్లి, సామర్లకోట ప్రాంతాల్లో పట్టుకుని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఎంవీపీ కాలనీలోని సెక్టార్ -1 సాయికామాఖ్య రెసిడెన్సీలో నివసిస్తున్న ఎరువురు రజనీకుమారి (63) అనే మహిళకు ఈ ఏడాది మే నెలలో మోహనకుమార్ అనే వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. హవాలా లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు లభించడంతో, కేసు నమోదు చేశామని, అరెస్ట్ చేస్తామని ఆమెను బెదిరించాడు. రెండు రోజుల తర్వాత మరో వ్యక్తి కాల్ చేసి కేసు లేకుండా చేయడానికి డబ్బులు డిమాండ్ చేశాడు. డబ్బు చెల్లించకపోతే ముంబై డివిజన్ సెల్‌లో పెడతామని హెచ్చరించడంతో బెదిరింపులకు భయపడి తన కనకమహాలక్ష్మీ అకౌంట్ నుంచి రూ.8.5 లక్షల నగదును వారి అకౌంట్‌కు బదిలీ చేసింది. దర్యాప్తులో నగదు బదిలీ తీరును పరిశీలించగా కొందరి కరెంట్ అకౌంట్స్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. కమీషన్ కోసం కక్కుర్తి పడి కరెంట్ అకౌంట్లను సైబర్ నేరగాళ్లకి అందించిన అనకాపల్లి జిల్లాకు చెందిన ముదపక నరసింగరావు, బాపట్ల జిల్లాకు చెందిన జంపాల సందీప్, కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన వీరేటి సత్యనారాయణ, గుంటూరు జిల్లాకు చెందిన డమర్లబాల ఫణికుమార్, భీమవరానికి చెందిన జవ్వాడి రామాంజనేయులు, కాకినాడకు చెందిన సతీష్‌చంద్రలను సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు.

ఆటోడ్రైవర్ అదృశ్యంపై భార్య ఫిర్యాదు

మధురవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ భగవాన్ యాదవ్ ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదని అతడి భార్య లక్ష్మీ సోమవారం పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి ఆటోతో వెళ్లాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. సోమవారం తన భర్త నడుపుతున్న ఆటో సాగర్‌నగర్ శివాలయం సమీపంలో కనిపించినట్లు లక్ష్మీ తెలిపిందని సీఐ వివరించారు. భగవాన్‌యాదవ్ ఆచూకీ తెలిస్తే 94407 96060, 08912 72133, 77993 67101 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సీఐ బాలకృష్ణ కోరారు.


భగవాన్ యాదవ్ (ఫైల్ ఫొటో)

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సీతమ్మధార కేఆర్ఎం కాలనీకి చెందిన జోని సురేష్(28) గత నెల 27న రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించినా, స్విచ్ ఆఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు, బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నగరంలో సోమవారం సాయంత్రం నీలిరంగు ఆకాశం సింధూర వర్ణంలోకి మారిపోయి కనువిందు చేసిన దృశ్యం
-ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం